Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 98 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 18 - 10 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## గాంధీనే విడిచి పెట్టలేదు, నేనెంత...

## ఆర్ఎస్ఎస్‌పై నిప్పులు చెరిగిన ప్రియాంక్ ఖర్గే



**బెంగళూరు :** బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే శుక్రవారంనాడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జన సమీకరణల పేరుతో సమాజాన్ని విషపూరితం చేస్తున్నారని, మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి ప్రముఖులకు ఎదురైన చారిత్రక చేదు అనుభవాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ ప్రాంగణాల్లో ఇక నుంచి ఎలాంటి సమావేశాలను నిర్వహించ రాదని కర్ణాటక మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. 'ముఖ్య మంత్రి నేను లేఖ రాశాను. దానిని పరిగణనలోకి తీసుకుని ఇక నుంచి ప్రభుత్వ సంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలకు సంబంధించిన కొత్త రూల్స్ అమల్లోకి తెస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి ఎలాంటి సమీకరణలకు కానీ, సమావేశాలకు కానీ ముందస్తుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే లీగల్ చర్యలు తీసుకుంటాం' అని ప్రియాంక్ ఖర్గే మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. 'ఆర్ఎస్ఎస్, బీజేపీల స్థాయీ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్ఓపి) ఆలోచన అంతిమంగా మహాత్మాగాంధీ మరణానికి, బాబా సాహెబ్ అంబేడ్కర్ ఓటమికి దారితీసింది. ఇది సమాజాన్ని అత్యంత విషపూరితం చేసే ఆలోచన. మహాత్మాగాంధీ వంటి గొప్ప వ్యక్తులనే వాళ్లు లెక్క చేయనప్పుడు నేను ఎంత?' అని ఆయన ప్రశ్నించారు. ప్రధాన అంశాల నుంచి దారి మళ్లించేందుకు బీజేపీ వ్యక్తిగత దాడులకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. తనను వ్యక్తిగతంగా నిందించడానికి బదులు ఆర్ఎస్ఎస్ తరపున ఎందుకు మాట్లాతున్నారో బీజేపీ సమాధానం చెప్పాలన్నారు. 'ఆర్ఎస్ఎస్ తరపున మాట్లాడేందుకు వాళ్లు ఎవ్వరు. ఆర్ఎస్ఎస్ తనకు తాను డిఫెండ్ చేసుకోలేదా?' అని ఆయన నిలదీసారు.

**ప్రభుత్వ అధికారుల ధిక్కారం**

కాగా, ఆర్ఎస్ఎస్ ఈవెంట్లలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రభుత్వ అధికారులు మాట్లాడుతున్నారంటూ ఖర్గే ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు తటస్థంగా ఉండటాన్ని తప్పనిసరి చేస్తూ కర్ణాటక స్టేట్ సివిల్ సర్వీస్ (కాండక్ట్) రూల్స్-2021ను అమలు చేయాలని సీఎంను ఆయన కోరారు. ఇది తాను పెట్టిన రూల్ కాదని, కర్ణాటక సివిల్ సర్వీస్ రూల్ అని, ప్రభుత్వ ఉద్యోగాలు రాజకీయ సంస్థలతో సంబంధం ఉన్న ఎలాంటి కార్యక్రమాల్లోనూ పాల్గొనరాదని ఆ నిబంధన చెబుతోందని అన్నారు. అయినప్పటికీ పీడీఓలు, విలేజ్ అకౌంటెంట్లు, ఇతర అధికారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ ఈవెంట్లలో ప్రసంగిస్తున్నారని చెప్పారు.

**షోకాజ్ నోటీసులు**

కాగా, ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న అధికారులకు ప్రభు త్వం షోకాజ్ నోటీసులు ఇచ్చింది. వారిని సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఖర్గే ఈ విషయాన్ని ధ్రువీకరించారు. తన డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. సిద్ధాంతాలు ఉంటే ఉండవచ్చని, కానీ ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్ర నిబంధనలను పాటిం చాల్సిందేనని పేర్కొన్నారు.

## రాజకీయ వ్యవస్థలో యువతను భాగస్వామ్యం చేస్తాం : పవన్ కల్యాణ్

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాజకీయ వ్యవస్థలో నవతరం యువతను భాగస్వామ్యం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. సమాజంలో మార్పు కాంక్షించే ప్రతీ ఒక్కరికీ వారి వంతు సేవలు మాతృభూమికి అందించే అవకాశం కల్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు పవన్ కల్యాణ్. ఇందులో భాగంగా 'సేనతో సేనాని – మన నేల కోసం కలిసి నడుద్దాం' అంటూ ఒక వినూత్నమైన కార్యక్ర మాన్ని జనసేన నిర్వహించనుందని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక యువతీ, యువకులు తమకు నచ్చిన అంశాన్ని ఎంచుకుని సేవలు అందించే అవకాశాన్ని ఈ వేదిక కల్పించనుందని తెలిపారు. మార్పు కోరుకుంటే రాదని.. మార్పు కోసం ప్రయత్నిస్తే వస్తుందని ఉద్ఘాటించారు. ఈ ప్రయ




త్నంలో ప్రతీ ఒక్కరూ భాగస్వా మ్యం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలుపం చుకునేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, లేదా లింక్ మీద క్లిక్ చేసి ఇప్పుడే రిజిస్టర్ చేసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దారుణం.. ఫారెస్ట్ సిబ్బందిపై వేట కొడవళ్లతో దాడి

**భద్రాద్రి కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఫారెస్ట్ సిబ్బందిపై ఆదివాసీ పోడు రైతులు శుక్రవారం వేట కొడవళ్లతో దాడి చేశారు. కరకగూడెం మండలం అశ్వాపురపాడు గ్రామం అటవీ ప్రాంతంలో దాడి చేశారు వలస ఆదివాసీ పోడు రైతులు. పోడు భూమిలో ఆదివాసీ గిరిజనులు హార్వేస్టర్ మిషన్ ద్వారా వరి పంట కొస్తుండగా ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారు. దీంతో అధికారులపై ఆగ్రహంతో వలస ఆదివాసీ గిరిజనులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు గోవింద్, కోటేష్‌కి గాయాలయ్యాయి. గాయాలైన అధికారులకి స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై అధికారులు కరకగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు ఆదివాసీ పోడు రైతులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫారెస్ట్ అధికారులపై దాడి చేస్తే ఊరుకునేది లేదని ఆదివాసీ పోడు రైతులని పోలీసులు హెచ్చరించారు.

## రాయవరం పేలుడు ఘటనపై విచారణ కమిటీ కీలక వ్యాఖ్యలు



**రాయవరం, (రాజధాని వార్తలు):** కోనసీమ జిల్లా రాయవరంలోని గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ బాణసంచా పరిశ్రమలో పేలుడు ఘటన సంభవించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 10 మంది మృతి చెందారు. దీనిపై విచారణ కమిటీ కూడా ఏర్పాటు అయింది. తాజాగా ఈ కమిటీలోని సభ్యులు సురేష్ కీలక కామెంట్స్ చేశారు. రాయవరంలో పేలుడు ఘటనపై విచారణ చేపట్టామని ఆయన తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాణసంచా పరిశ్రమలో పేలుడు ఘటనపై రెవిన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ, కార్మిక శాఖ అదికారులను విచారణ చేశాం. పేలుడు సంబవించిన గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌కు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం అన్ని అనుమతులు ఉన్నాయి. ప్రమాదం జరిగిన ముందు అంటే గత నెల 26 వతేదిన ఈ బాణాసంచా కేంద్రంలో తనిఖీలు జరిగాయి. తనిఖీలు జరిగిన రిపోర్టును పరిశీలించాము. బాణాసంచా తయారీ చేసే విషయంలో అన్ని ప్రమాణాలు పాటించారా లేదా అనే విషయంపై మాకు అనుమానాలు వస్తున్నాయి. ఈ పేలుడుకు సంబంధించిన ఫోరెన్సిక్ నివేదికులు రావాల్సి ఉంది. ఈ ప్రమాదంలో మృతి చెందిన 10 మంది.. పేద కుటుంబానికి చెందిన వారే. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎక్స్ గ్రేసియా ఇవ్వాలని మృతులు కుటుంబాలు, ప్రజాప్రతినిధులు వినతి పత్రాలు అందజేశారు. ఈ వినతులను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతాం. త్వరలోనే పూర్తి వివరాలు సేకరించి విచారణ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం' అని సురేష్ తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని లక్ష్మీ గణపతి ఫైర్ వర్క్స్ తయారీ కేంద్రంలో ఈనెల 8 పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు చనిపోగా.. పలువురికి గాయాలయ్యాయి. ఆ తరువాత మృతుల సంఖ్య 10కి చేరింది.

## వడ్డెర్లకు మైనింగ్ లీజుల విధానం సిద్ధం చేయండి

**- రాష్ట్రంలో ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం - మైనింగ్‌లో శాటిలైట్, డ్రోన్ చిత్రాల ద్వారా విశ్లేషణ - గనులు, ఉచిత ఇసుక విధానంపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు**



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో లభ్యం అవుతున్న ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గనుల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఖనిజాలకు విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం వస్తుందని సీఎం సూచించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో గనుల శాఖ, ఉచిత ఇసుక విధానంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 3320 కోట్ల ఆదాయార్జనను లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గతంతో పోలిస్తే 34 శాతం మేర అదనంగా గనుల శాఖ నుంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మాంగనీస్ లాంటి మేజర్ ఖనిజాల ఉత్పత్తిలో 72 శాతానికి పైగా ఆదాయం వస్తోందని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ఏపీలో ఉన్న మినరల్ వెల్త్ విలువను అంచనా వేయాలని సూచించారు. ఒడిశా లాంటి రాష్ట్రాల్లో వాల్యూ ఎడిషన్ ద్వారా ఎక్కువగా ఆదాయాన్ని పొందుతున్నారని.. రూ. 50 వేల కోట్ల ఆదాయం ఖనిజాల నుంచే వస్తోందని సీఎం తెలిపారు. ఏపీలోనూ అందుకు తగిన విజన్ ప్లాన్ తయారు చేసి విలువ జోడిస్తే రూ. 20-30 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. పెండింగ్ లో ఉన్న 6500 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు.

**వడ్డెర్లకు మైనింగ్ లీజులు కేటాయింపుపై మార్గదర్శకాలు రూపొందించండి**

వడ్డెర్లకు మైనింగ్ లీజుల కేటాయింపు అంశంపై విధానాన్ని తయారు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వడ్డెర్లు, సొసైటీలకు 15 శాతం మేర గనుల్లో రిజర్వేషన్ కల్పించే అంశాన్ని వచ్చే కేబినెట్‌లో చర్చించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వెనుకబడిన వర్గాలైన వడ్డెర్లకు ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా లీజు కేటాయింపు విధానాన్ని రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. సీనరేజి, ప్రీమియం మొత్తాల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని ఆదేశించారు. మైనింగ్ లీజుల కేటాయింపుతో పాటు వారు ఎంఎస్ఎంఈలుగా ఎదిగేందుకు కూడా ప్రస్తుతం ఉన్న పాలసీని అనుసంధానించాలని అన్నారు. రాష్ట్రంలో గనుల తవ్వకాలకు సంబంధించి శాటిలైట్ చిత్రాలు, డ్రోన్ ఆధారిత టెక్నాలజీతో విశ్లేషించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇచ్చిన పర్మిట్లు, జరిగిన తవ్వకాలు ఎంత అనేది ఎప్పటికప్పుడు విశ్లేషించాలన్నారు. అనలటిక్స్ ను వినియోగించుకుని జరిగిన తవ్వకాలను అంచనా వేయాలన్నారు. బీచ్ శాండ్ మినరల్స్ లాంటి భార ఖనిజాల మైనింగ్‌తో పాటు విలువ జోడింపు ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. అలాగే కడపలో నిర్మించనున్న స్టీల్ ప్లాంట్‌కు ముడి ఇనుము ఖనిజం సరఫరాపై కూడా అధ్యయనం చేయాలని సూచించారు.

**ఉచిత ఇసుకతో ప్రజలకే ప్రయోజనం దక్కాలి**

ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలందరికీ ప్రయోజనం కలగాలని సీఎం స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఉచిత ఇసుక సరఫరాను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వ్యవస్థలో ఉన్న లోపాలను వినియోగించుకుని దుర్వినియోగం చేసే అవకాశం లేకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సీజన్ కోసం 66.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేశామని.. ప్రస్తుతం అన్ని స్టాక్ పాయింట్లలోనూ 43 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ చిట్టచివరి వ్యక్తికీ ప్రయోజనం దక్కేలా ఇసుక లభ్యత జరగాలని అన్నారు. ఇసుక లోడింగ్‌తో పాటు రవాణాకు అతితక్కువ వ్యయం అయ్యేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక లభ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోని అన్ని రూట్లలో పెట్టిన సీసీ కెమెరాల నిఘాను మరింత పటిష్టం చేయాలని సీఎం సూచించారు. ఆర్టీజీఎస్ ద్వారా ఉచిత పంపిణీ విధానంపై పర్యవేక్షించాలని సీఎం అన్నారు. ఈ సమీక్షకు గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, కమీషనర్ ప్రవీణ్ కుమార్, ఆ శాఖ ఉన్నతాధికారులు, ఆర్టీజీఎస్ అధికారులు హాజరయ్యారు.

## శ్రీవారి లడ్డూ ధరలపై వదంతులకు ఫుల్‌స్టాప్.. భక్తులకు గుడ్ న్యూస్

**తిరుమల, (రాజధాని వార్తలు):** తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఎక్కడెక్కడి నుంచో భక్తులు కొండకు తరలి వస్తుంటారు. తిరుమల శ్రీవారు ఎంత ఫేమస్సో... శ్రీవారి లడ్డూ కూడా అంతే ఫేమస్ అని చెప్పుకోవాలి. శ్రీనివాసుడిని దర్శనం చేసుకున్న తర్వాత శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఎంతో పవిత్రంగా భావించి తీసుకుంటారు భక్తులు. అయితే గత కొద్ది రోజులుగా తిరుమల లడ్డూ ప్రసాదం ధరలను పెంచుతారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. తిరుమల లడ్డూను పెంచేందుకు టీటీడీ ప్రయత్నాలు చేస్తోందంటూ వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా శ్రీవారి ధరల పెంపు ప్రచారంపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పందిస్తూ... ధరల పెంపుపై క్లారిటీ ఇచ్చారు. శ్రీవారి లడ్డూ ధరలను పెంచే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు టీటీడీ ఛైర్మన్. లడ్డూ ధరల పెంపు వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. కావాలనే కొన్ని ఛానళ్లు పనిగట్టుకొని టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లడ్డూ ధరల పెంపు అంటూ నిరాధార వార్తలను ప్రసారం చేస్తున్నారని అన్నారు.




**రాయపూడి గ్రామం సమీపంలోని ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అఖిల భారత సేవాధికారుల నివాస అపార్ట్‌మెంట్‌లు నిర్మాణంలో ఉన్నాయి.**

# గూగుల్ రాకతో విశాఖకు మహర్ధశ

## - టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ పాలనతో విశాఖపట్నం ముఖచిత్రం మారబోతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్‌కు గ్రీన్ సిగ్నల్ వచ్చిన సందర్భంగా గంటా నూకరాజు మీడియా సమావేశంలో స్పందించారు దేశ ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్ధత, ఐటి శాఖామంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగా ఇది సాధ్యమయిందని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లభించేవిధంగా కూటమి సర్కార్ చేస్తున్న కృషి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. 2014-19 కాలంలో విదేశీ పెట్టుబడులతో రాష్ట్రంలో అనంతపురం జిల్లాలో కియా మోటర్స్ ఏర్పాటు చేశారని అన్నారు. నేడు ప్రపంచ స్థాయి గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్‌ను ఆంధ్రాకి రప్పించారని అన్నారు. అమెరికా వెలుపల గూగుల్ అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటుకు విశాఖ వేదిక కానుందని అన్నారు. గతంలో మైక్రో సాఫ్ట్ హైదరాబాద్ రూపురేకలు మార్చినట్టే నేడు గూగుల్ విశాఖ రూపురేఖలను మారుస్తుందని అన్నారు. దీని రాకతో జిల్లాకు అనేక అనుబంధ కంపెనీలు రానున్నాయని అన్నారు. గ్రేటర్ విశాఖ భారీ ఆర్థిక వ్యవస్థగా మారుతుందని అన్నారు. కొన్ని వేల మంది యువతకు, లక్షల సంఖ్యలో సాఫ్ట్‌వేర్లకు విశాఖ జిల్లా అమ్మలా మారబోతుందని అన్నారు. కూటమి సర్కార్ పనిచేసి చూపిస్తుందని..వైసిపీ కోడిగుడ్ల కథ చెబుతుందని వ్యాఖ్యానించారు. అదేవిదంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కోసం వైసిపీ రాద్ధాంతం చేస్తుందని అన్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణం విషయంలో నాణ్యత, పేద పిల్లలకు 50 శాతం సీట్లు కేటాయించడం వంటి నిర్ణయాలు కారణంగా పిపిపి పద్ధతులను కూటమి సర్కార్ అవలంభించిందని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్తుతుల కారణంగా పబ్లిక్ ప్రైవేటు పార్ట్నర్ షిప్ నిర్ణయమని అంతేకానీ ఎక్కడా ఆస్తులను అమ్మడం గాని, అప్పగించడం గానీ లేదనే విషయాన్ని వైసిపీ నాయకులు అర్థం చేసుకోవాలని అన్నారు. మెడికల్ కాలేజీల విషయంలో అనవసరం రాద్ధాంతం మానుకోవాలని, రాష్ట్రం అభివృద్ధి దశలో పరుగులు పెడుతుందని, యువతకు అధికసంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా వచ్చే అవకాశం ఉందని గంటా నూకరాజు తెలియజేసారు.

# సీబీసీ ఆధ్వర్యంలో గుంటూరులో స్వచ్ఛోత్సవ్






**గుంటూరు, (రాజధాని వార్తలు):** సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ గుంటూరు క్షేత్ర కార్యాలయం గుంటూరులోని ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో రెండు రోజులపాటు "స్వచ్ఛత హీ సేవా" కార్యక్రమాలలో భాగంగా స్వచ్ఛోత్సవాలను నిర్వహించింది. ఎస్‌హెచ్‌ఎస్ 2025 మరియు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలలో భాగంగా సీబీసీ గుంటూరు కార్యాలయం నిర్వహించిన ఈ కార్యక్రమాలలో గుంటూరులోని సిల్వనస్ స్టాల్ గర్ల్స్ స్కూల్ మరియు లూర్డ్స్ హైస్కూల్‌లకు చెందిన వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి అడుగులోనూ స్వచ్ఛతను ఆచరిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. రమేశ్ చంద్ర విద్యార్థులకు పిలుపునిచ్చారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడం కూడా విద్యార్థుల బాధ్యతేనని ఆయన గుర్తుచేశారు. పరిశుభ్రమైన పాఠశాలలు, శుభ్రతపరమైన అలవాట్లు విద్యార్థుల శారీరక మరియు మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని రమేశ్ చంద్ర పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల భాగంగా, సీబీసీ గుంటూరు లూర్డ్స్ హై స్కూల్‌లో క్విజ్ పోటీలు, అలాగే స్టాల్ గర్ల్స్ హై స్కూల్‌లో శుభ్రతా కార్యక్రమాలు నిర్వహించింది. క్విజ్ విజేతలు మరియు శుభ్రతా కార్యక్రమాలలో పాల్గొన్న వాలంటీర్లకు సీబీసీ అధికారి రమేశ్ చంద్ర బహుమతులు ప్రదానం చేసారు. స్వచ్ఛ ఆంధ్ర మరియు స్వచ్ఛ భారత్ లక్ష్యాల సాధనలో భాగంగా విద్యార్థులు తమ పాఠశాల ప్రాంగణంలో కనీసం రెండు గంటల పాటు స్వచ్ఛందంగా శుభ్రతా కార్యక్రమాలలో పాల్గొంటామని స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. స్టాల్ గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి.ఆనంద కుమారి మరియు లూర్డ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం. బాలశౌరి, పాఠశాల అధ్యాపకులు తమ తమ పాఠశాలల ప్రాంగణాలలో నిర్వహించిన ఎస్‌హెచ్‌ఎస్ 2025 కార్యక్రమాలలో సీబీసీ సిబ్బంది సి హెచ్ కోటేశ్వర రావు, డి. సత్య శివప్రసాద్‌లతో కలిసి శ్రమదానం చేశారు.

# సాలిపేటలో చోరీ - మూడు తులాల బంగారం అపహరణ : ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని సాలిపేట గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. ఈ చోరీలో దొంగలు మూడు తులాల బంగారం అపహరించుకుపోయారు. ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు గురువారం అందించిన వివరాలు ప్రకారం, సాలిపేట గ్రామానికి చెందిన రొంగలి శంకర్రావు బుధవారం ఉదయం తన ఇంటికి తాళం వేసుకొని, భార్యతో కలిసి వ్యవసాయ పనుల నిమిత్తం బయటికి వెళ్ళాడు. వ్యవసాయ పనులు ముగించుకుని మళ్లీ మధ్యాహ్నం 12 గంటలకు తన భార్య తో కలిసి ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో ఆందోళనకు గురైన శంకర్రావు ఇంటి లోపలికి వెళ్లి చూడగా, బీరువా తలుపులు పగలగొట్టి, అందులో ఉన్న సుమారు మూడు తులాలు బంగారపు వస్తువులు అపహరించకపోయినట్లు గుర్తించాడు. బంగారపు పుస్తెలతాడు, రెండు శతమానాలు దొంగిలించుకుపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే సంఘటన స్థలికి పోలీసులు వెళ్లి చోరీ జరిగిన తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు



**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** జాతీయ స్థాయిలో నిర్వహించిన పద్యాల పోటీలలో తొలి 20 స్థానాలలో బాలికోన్నత పాఠశాల విద్యార్థినిలు నిలవడం గర్వకారణమని బుచ్చిరెడ్డిపాలెం మండల విద్యాశాఖాధికారి యం.దిలీప్ కుమార్ అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పెద్దూరు బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో లవ్ పీపుల్ ఫౌండేషన్ నిర్వహించిన వేమన పద్యాల జాతీయ పోటీలలో 13, 16 స్థానాలు పొందిన పి.పావని, ఎం.లక్ష్మీ ప్రసన్నలను అభినందించి గురువారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన పద్యాలలో విలువలు, జీవన నైపుణ్యాలు,లోకం పోకడ ఉంటాయన్నారు. సామాన్యులకు అర్థమయ్యే రీతిలో సాహిత్యాన్ని పరిచయం చేసిన వేమనలోకం వీడి ఆరు శతాబ్దాలైన అందరి హృదయాలలో చిరస్థాయిగా ఉన్నారన్నారు. తెలుగు సాహిత్యాన్ని అందరికీ అందిస్తూ, మధురిమలను పంచుతూ, విశేష కృషి సల్పుతున్న గండికోట సుధీర్ కుమార్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం. సుజాత, తెలుగు ఉపాధ్యాయులు రమణమ్మ, రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

# కోటి సంతకాల సేకరణ విజయవంతం చేయాలి : కార్యకర్తలకు పిలుపునిచ్చిన చిన్న శ్రీను



**భీమిలి, (రాజధాని వార్తలు):** కోటి సంతకాల సేకరణ విజయవంతం చేయాలని నియోజకవర్గం వైకాపా ఇంచార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం భీమిలి నియోజకవర్గం ఎండాడ వైయస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైస్సార్ సిపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి వైస్సార్ సిపీ సమన్వయకర్త శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అధ్యక్షతన 5,6,7,8 వార్డ్స్ మరియు భీమిలి నియోజకవర్గం వైయస్ఆర్ సీపీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వనికి దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజాపాలన లేదు అని మండిపడ్డారు. మెడికల్ కాలేజ్ పేద ప్రజలకు ఆరోగ్యానికి జీవనాడి అని వాటిని ప్రైవేట్‌పరం చేస్తే పేదవాడికి వైద్యం ఎక్కడ జరుగుతుందని అయన మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు యురియా వాడితే క్యాన్సర్ వస్తుందని మద్యం తాగితే ఆరోగ్యంగా ఉంటారన్నది చంద్రబాబు స్లోగన్ అని అన్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యం తయారు చేయడానికి కుటీర పరిశ్రమలు ఏర్పడి ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డుల నాయకులు పోతిన హనుమంతు, పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి, తైనాల విజయ్ కుమార్, పెదబాబు, ఎంపీపీ వాసు రాజు, మండల పార్టీ ప్రెసిడెంట్ గాడు శీను, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, చెన్నాదాస్, రోషి రెడ్డి, పెండాలం పద్మావతి, పిల్ల సుజాత, చెరుకూరి రజని, డి.వరలక్ష్మి, అక్రమాన రాము నాయుడు, జగ్గుపల్లి ప్రసాద్, చిల్ల భాస్కర్ రెడ్డి, జీరు వెంకటరెడ్డి, అల్లిపిల్లి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ జిఎస్టీ...సూపర్ సేవింగ్స్ పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్ వలన రవాణా రంగంలో కలిగే ప్రయోజనాలను తెలిపే పోస్టర్లను, బ్యానర్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆవిష్కరించారు. గురువారం తిక్కన ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఈ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. జిఎస్టీ తగ్గింపు వలన ధరలు తగ్గిన బైక్‌లు, కార్ల వివరాలను రవాణాశాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. సుమారు పదివేల నుంచి లక్ష రూపాయలకు పైగా ధరలు తగ్గినట్లు రవాణా శాఖ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో జిఎస్టీ కమిషనర్ కిరణ్‌కుమార్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ చందర్, ఆర్టీవో ఎండి మథాని, ఎంవిఐ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# జోరు వానలో సైతం కొనసాగుతున్న ఉపాధ్యాయుల ఆందోళన



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జూన్ 2025న బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం జోరు వానలో సైతం నెల్లూరు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ఆందోళన కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఒకే పాఠశాలలో పనిచేసే కంపల్సరీ బదిలీ జరిగిన వారిని ఇప్పుడు కూడా రిలీవ్ చేయకపోవడం వల్ల పలువురు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంట్లో పెద్దవారి ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంతో పాటు పిల్లల చదువులు వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ ఉపాధ్యాయులు భారతి, సుష్మ, బ్యూలా, సుభాషిని, సుమ శోభారాణి జిల్లా ఉపాధ్యాయ నాయకులు హజరత్ సీనియర్ ఉపాధ్యాయులు దేవప్రసాద్, వెంకట్రావు మహిళా పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వానికి ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు : మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య





**గజపతినగరం,(రాజధాని వార్తలు):** జగన్మోహన్ రెడ్డి హయాంలో తీసుకువచ్చిన 17 ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం కూటమి ప్రభుత్వానికి తగదని మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత బొత్స అప్పల నరసయ్య అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నకు వ్యతిరేకంగా చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆయన గురువారం శ్రీకారం చుట్టారు. అప్పల నరసయ్య తొలి సంతకం చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పేదలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో గత తమ ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలను తీసుకువచ్చిందన్నారు. పేద విద్యార్థులకు ఉచిత వైద్య, విద్య అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించే ప్రయత్నాలను తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. తమ పార్టీ అధినేత వై.యస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నామన్నారు. ప్రజల ఆరోగ్యం-విద్యను కాపాడే లక్ష్యంలో భాగంగా తమ పార్టీ చేపడుతున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గార తౌడు మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, బెల్లాన త్రినాధరావు, కే.పైడపునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల ధ్వంసంపై అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమం

**- సిపిఐఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు - ఇసుక లారీల విద్యాసంపై ప్రజాప్రతినిధులు మౌనం వీడాలి - తెలుగుదేశం మండల అధ్యక్షులు చిట్టిబాబు - రహదారుల నిర్మాణం కొరకు ఎంతటి ఉద్యమానికైనా సిద్ధం - కచ్చల కల్పన సిపిఐఎంఎల్ మాస్ లైన్ - రాజకీయాలకు అతీతంగా ఉద్యమాలు చేయాలి - సిపిఐ ఎం ఆధ్వర్యంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం**





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** ఇసుక లారీల విధ్వంసంతో ధ్వంసమైన జాతీయ రహదారి పునర్మానం కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి సిపిఐఎం సిద్ధంగా ఉందని కలిసొచ్చే అన్ని పక్షాలను కలుపుకొని రహదారుల పునర్మించేంతవరకు నిరంతరాయ ఉద్యమాలను నిర్మించాలని, తాత్కాలికంగా ఆగిన ఇసుక లారీలను రోడ్లు బాగు చేయకుండా మళ్లీ అనుమతిస్తే సడక్ బంద్ నిర్వహిస్తామని సిపిఐఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు హెచ్చరించారు.. గురువారం పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ఆవరణలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశంలో మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఇప్పటివరకు వివిధ రాజకీయ పక్షాలు ఎవరికి వారుగా పలు రూపాలలో ఉద్యమాలు నిర్వహించారని సిపిఐఎం ఆధ్వర్యంలో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండల కమిటీల నేతృత్వంలో రాస్తారోకోలు, పాదయాత్రలు, నిర్వహించినప్పటికీ ఇటు అధికారులు గానీ అటు ప్రజాప్రతిథులు గాని స్పందించడం లేదని ఈ నేపథ్యంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రహదారులు నిర్మాణానికి మరో ఉద్యమానికి సిపిఐఎం శ్రీకారం చుట్టిందని మచ్చ స్పష్టం చేశారు. కలిసొచ్చే అన్ని పక్షాలను కలుపుకొని ఈ సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పలు రూపాలలో ఉద్యమాలు నిర్వహించాలని కోరారు.

**ప్రజా ప్రతినిధులు మౌనం వీడాలి**

గోదావరి నది నుండి లక్షల క్యూబిక్ల ఇసుకను తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు రోడ్డుల విద్వాశంపై మౌనం విడాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తాళ్లూరు చిట్టిబాబు కోరారు. గతంలో ఎన్నడు లేని విధంగా భద్రాచలం వెంకటాపురం జాతీయ రహదారి పూర్తిగా ధ్వంసం అయిపోయిందని ఇప్పటికీ ప్రజాప్రతిని స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. సిపిఐ ఎం చేస్తున్న ఈ మంచి ప్రయత్నానికి తెలుగుదేశం పూర్తిగా మద్దతిస్తుందని అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి పోరాటంలో తెలుగుదేశం పార్టీ భాగస్వామి అవుతుందని చిట్టిబాబు స్పష్టం చేశారు.

**రహదారుల నిర్మాణం కొరకు ఎంతటి ఉద్యమానికి అయినా సిద్ధం**

ధ్వంసమైన రహదారుల నిర్మాణం కొరకు జరిగే పోరాటంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పూర్తిగా భాగస్వామ్యం అవుతుందని ఇసుక లారీలు నియంత్రణకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని ఆ పార్టీ డివిజన్ నాయకురాలు కెచ్చల కల్పన అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధికలోడులతో తిరిగే లారీల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆమె అన్నారు. భద్రాచలం కేంద్రంగా జరిగే ఇసుక దందాను ప్రభుత్వ పెద్దలు ప్రోత్సహిస్తున్నారని ఇసుక రాకాసుల వెనక ఎవరున్నా భయపడేది లేదని అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రభుత్వం దిగివచ్చేంత వరకు ఉద్యమాలు చేయాలని కోరారు.

**భద్రాచలం నుండి వెంకటాపురం వెళ్లాలంటేనే నరకం కనిపిస్తుంది : ముర రమేష్ కొండరెడ్డిల సంఘం**

గోదారమ్మ గోష పట్టించుకోకుండా ప్రభుత్వ ఖజానా నింపుకోవడం కోసం ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి విచ్చలవిడిగా ఇసుక ర్యాంపులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో జాతీయ రహదారి పూర్తిగా ధ్వంసం అయిపోయిందని భద్రాచలం నుండి వెంకటాపురానికి ప్రయాణించాలంటేనే నరకయాతన అనుభవించాల్సి వస్తుందని చర్ల,దుమ్ముగూడెం మండలాల నుండి అత్యవసర వైద్య నిమిత్తం భద్రాచలానికి రావాలంటే దారిలోనే ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుందని కొండరెడ్ల సంఘం డివిజన్ నాయకులు రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా నడుస్తున్న ఇసుక ర్యాంపులను నిలిపివేసేంతవరకు పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి పోరాటానికి కొండరెడ్ల సంఘం నుండి పూర్తిగా మద్దతిస్తామని ఆయన రౌండ్ టేబుల్ సమావేశానికి హామీ ఇచ్చారు.

**గతంలో ఎన్నడు లేని విధంగా ఇసుక దోపిడీ జరుగుతుంది**

గతంలో భద్రాచలం డివిజన్లో ఎన్నడూ లేని విధంగా ఇసుక దోపిడీ జరుగుతుందని ప్రముఖ సంఘ సేవకులు గాదే మాధవ రెడ్డి ఆరోపించారు. గత రెండు సంవత్సరాల నుండి ఇదేచ్ఛగా జరుగుతున్న ఇసుక రవాణాతో రోడ్లు పూర్తిగా ధ్వంసం అయిపోయాయని వీటిని పునమించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా రహదారుల పునర్ నిర్మాణం కోసం జరిగే ఈ ఉద్యమానికి ప్రతి ఒక్కరు మద్దతుగా నిలవాలని కోరారు. భద్రాచలం నియోజకవర్గం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని దాన్ని రక్షించుకునేందుకు రాజకీయాలను పక్కనపెట్టి కలిసి రావాలని పికలిసి రావాలని గాదే మాధవరెడ్డిలు పిలుపునిచ్చారు.

అనంతరం ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రముఖ న్యాయవాది పావురాజు తిరుమలరావు, ప్రముఖ వ్యాపారవేత్త మల్లికార్జునరావు, ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు మున్నాఫ్, జిందా రిటైర్ పెన్షన్స్ నాయకులు బందు వెంకటేశ్వర్లు, నాగభూషణం కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు పరిమి సోమశేఖర్, బీసీ ఐక్యవేదిక డివిజన్ నాయ కులు నరసింహ చారి, భద్రాచలం సొసైటీ అధ్యక్షులు అభినేని శ్రీనివాస్,మహాజన సమితి నాయకులు జి సుధాకర్, తదితరులు మాట్లాడుతూ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని రహదారుల పునర్నిర్మాణం కోసం జరిగే ప్రతి పోరాటంలో కలిసొస్తామని హామీ ఇచ్చారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు భద్రాచలం పట్టణంలోకి లారీలు తిరగకుండా నియంత్రించాలని అధికారులను కోరాలని సూచించారు. అనంతరం ధ్వంశమైన ప్రధాన రహదారి పునర్నిర్మాణం కోసం జరిగే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా భాగస్వాములు కావాలని రెండు టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రేపాకుల శ్రీనివాస్, గడ్డం స్వామి, యం.చంద్రయ్య రైతు సంఘం నాయకులు ఎలమంచిలి వంశీకృష్ణ,మచ్చ రామారావు, సిఐటియు పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు నాయకులు ఎన్ నాగరాజు అజయ్ కుమార్, గిరిజన సంఘం నాయకులు సున్నం గంగా, కుంజా శ్రీనివాస్, ఐద్వా నాయకులు గౌతమి, పూర్ణిమ, జీవన జ్యోతి గిరి సంఘం నాయకులు కుంజా శ్రీనివాస్ కుంజా విజయ డివైఎఫ్ఐ నాయకులు, పి సంతోష్ కుమార్, దారిశెట్టి సతీష్ బాబు కెవిపిఎస్ నాయకులు కోరాడ శ్రీనివాస్, రాయల రాములు, ఎస్ఎఫ్ఐ నాయకులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కూటమి ప్రభుత్వ లక్ష్యం : కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**కొత్తపేట, (రాజధాని వార్తలు):** గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కావాల్సిన చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా రావులపాలెం సీఆర్సీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్,ఆర్డీఓ పి శ్రీకర్, డి.ఎస్.పి సుంకర మురళీమోహన్ తదితరులతో కలిసి పాల్గొన్నారు. 400మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలకు చెందిన మహిళలకు సామూహిక సీమంతాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సిఆర్సి సభ్యులను అభినందించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు.


మహిళలు సమతుల్యమైన పోషక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మన ఇంటి పరిసరాల్లో సేంద్రియ విధానంలో ఆకుకూరలు పండించి వినియోగించుకుంటే ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవని సూచించారు. కిషోర బాలికల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు సేవాభావంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.


# వి.ఎస్.యూలో ఘనంగా వరల్డ్ ఫుడ్ డే వేడుకలు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఫుడ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో "వరల్డ్ ఫుడ్ డే" వేడుకలను ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి డా. ఎస్.బి.సాయినాథ్ మాట్లాడుతూ, "ఆహార భద్రత, పోషకాహారం ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రపంచ వ్యాప్తంగా ఆకలి నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్రను పోషించాలి" అని పిలుపునిచ్చారు. అలాగే ఆయన మాట్లాడుతూ, "ఆహార వృథాను తగ్గించడం, సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించడం, మరియు ప్రజల్లో పోషకాహార విలువలపై చైతన్యం పెంపొందించడం ద్వారా సమాజంలో ఆరోగ్యకరమైన మార్పు తీసుకు రావచ్చు" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫుడ్ టెక్నాలజీ విభాగ అధ్యాపకులు డా. జె.నాగరాజు, డా.శారద ఎబేటి, డా.ఆర్.పావని పాల్గొన్నారు. విద్యార్థులు స్వయంగా ఆహార ప్రదర్శన స్టాళ్లు ఏర్పాటు చేసి, వివిధ రకాల పోషకాహార ఉత్పత్తులను ప్రదర్శించారు.

# పాదలకూరు రోడ్డు, కొత్తూరులలో ఆక్రమణల తొలగింపు










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో స్థానిక 30, 31వ డివిజన్లు పొదలకూరు రోడ్డు, కొత్తూరు ప్రాంతాలలో రోడ్లను ఆక్రమించి నిర్మించిన ఇండ్లు, దుకాణాలను గురువారం తొలగించారు. అదేవిధంగా స్థానిక సుబేదార్ పేట నక్కలోళ్ళ సెంటర్ ప్రాంతంలో రోడ్లను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది తొలగించారు. అనుమతులు లేకుండా స్థానిక చిల్డ్రన్స్ పార్క్ ఎదురుగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాన్ని టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది తొలగించారు.

అనుమతులు లేని నిర్మాణాలు, డ్రైను కాలువలు, రోడ్లను ఆక్రమిస్తూ ఏర్పాటుచేసిన ఇండ్లు, దుకాణాల ను తప్పనిసరిగా తొలగించి వేస్తామని కమిషనర్ హెచ్చరించారు. స్థానిక ట్రంకు రోడ్డు లక్కీ షాపింగ్ మాల్ ప్రాంతంలో డ్రైనేజీ కాలువలపై నిర్మించిన కట్టడాలను టౌన్ ప్లానింగ్ అధికారులు జేసిబి యంత్రాలతో కూల్చి వేశారు.

# నీటిపారుదల పెండింగ్ పనుల అంచనా వ్యయం వెంటనే ప్రతిపాదించాలి

**- ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అవసరమగు భూసేకరణ వేగవంతం చేయాలి**

**- నీటిపారుదల శాఖను సమీక్షించిన కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి**





**విజయనగరం, (రాజధాని వార్తలు):**ముఖ్యమంత్రి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టారని అందువల్ల ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు కు అవసరమగు భూసేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి అన్నారు. అందుకు గాను జిల్లా లో 50 కోట్లు నిధులు ఉన్నాయని మొత్తం ప్రాజెక్ట్కు గాను భూసేకరణకు అవసరమగు నిధులు కొరకు ప్రభుత్వానికి నివేదించడానికి సమగ్ర నివేదిక నిర్ణీత ఫార్మాట్లో అందించాలని నీటిపారుదల అధికారులను ఆదేశిం చారు. జిల్లాలో నీటిపారుదల రంగంలో చేపట్టిన తోటపల్లి, నారా యణపురం, తారకరామ తీర్థసాగర్, మడ్డువలస, తాటిపూడి, అంద్ర ప్రాజెక్ట్ లపై జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి నీటిపారుదల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావే శంలో చీఫ్ ఇంజనీర్ / తోటపల్లి ప్రాజెక్టు ఇంచార్జ్ సూపరిం టెండెంట్ ఇంజనీర్ స్వర్ణకుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా నీటిపారుదల ప్రాజెక్ట్ల స్థితిగతులను, పురోగతిని కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్ట్లో గజపతినగరం బ్రాంచ్ కెనాల్కి అవసరమగు భూసేకరణ ఇంకా పూర్తి కాలేదని సత్వరం పూర్తిచేయాలని ఆదేశించారు. ఇకనుండి ప్రాజెక్ట్ వారి సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

నీటిపారుదల ప్రాజెక్ట్లకు అనుబంధంగా 759 ఎం.ఐ ట్యాంకులు ఉన్నాయని, జిల్లాలో ఆర్ ఆర్ ఆర్ లో భాగంగా చెరువుల పనులు జరుగుతున్నట్లు,అదేవిధంగా జిల్లాలో నలభై చెక్ డామ్లు ఉపాధి హామీ పథకం కింద 8.6 కోట్ల అంచనా వ్యయంతో పనులు జరుగుతున్నట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ స్వర్ణ కుమార్, ఎన్.ఈలు ఆర్.అప్పారావు, సుధాకర్, ఈ ఈ లు అప్పలనాయుడు, రమణ పాల్గొన్నారు.

# బాకీ కార్డు విడుదల చేసిన బిఆర్ఎస్ నాయకులు



**ముస్తాబాద్, (రాజధాని వార్తలు):** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తాటకర్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో బాకీ కార్డ్ ఇంటింటికి పంపిణీ చేయడం జరిగింది. అలవిగాని 420 హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి తీరా గెలిచాక హామీలను అమలు చేయకుండా మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆ పార్టీకి బుద్ధి చెప్తామ న్నారు. ఇక్కడ కేటీఆర్ సేన ముస్తాబాద్ మండల అధ్యక్షుడు వంగూరు దిలీప్, ఎదునూరి శ్రీనివాస్, పుల్లూరు సంతోష్, చేక్కపల్లి వెంకటేష్, కార్యదర్శి కొండూరు నవీన్, మెరుగు, వెంకటేష్, బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## తరాల మార్పుతోనే జాతికి నవోదయం

దేశ రాజకీయాలలో మార్పులు ఎలా సాధ్యమవుతాయి? తరాల మార్పుతోనే జాతి ప్రస్థానంలో మేలు మలుపులు సంభవిస్తాయని అసంఖ్యాకులు సునిశ్చితంగా విశ్వసిస్తున్నారు. మరి అటువంటి మార్పుల ఆగమన సూచనలు ఏమైనా కనిపిస్తున్నాయా? దేశ పాలనా వ్యవహారాలను నిర్దేశిస్తున్న నాయకత్వంలో తరం మార్పును మనం చూడగలమా? 1960వ దశకం తొలినాళ్లలో దేశ నాయకత్వంలో ఒక కొత్త తరం రానున్నదని చాలా మంది భావించారు. ఆ భావనతోనే 'నెహ్రూ తరువాత ఎవరు?' అనే విషయమై మథనపడ్డారు. దేశానికి కొత్త నాయకత్వం ప్రభవించనున్నదన్న ఆశ, ప్రభవించాలన్న ఆకాంక్షలే ఆ మథనంలో అంతర్లీనంగా ఉన్నాయి. 'కామరాజ్ ప్రణాళిక' (1963) అటువంటి ఆశాభావానికి ఆలంబన అయింది. ఎస్‌కె పాటిల్, అతుల్య ఘోష్, నిజలింగప్ప, నీలం సంజీవరెడ్డి మొదలైన పాత కాంగ్రెస్ యోధుల నిష్క్రమణతో దేశ నాయకత్వంలో తరం మార్పు సంభవిస్తుందనే నిండు నమ్మకం ప్రజల్లో నెలకొన్నది. అయితే ఆ నమ్మకం వమ్ముకావడానికి ఎంతో కాలం పట్టలేదు. 'మరలి వచ్చిన ఎర్ర గులాబీ'గా కీర్తిహారతి నందుకున్న నెహ్రూ తనయ ఇందిరాగాంధీ పార్టీలోనూ ప్రభుత్వంలోనూ తన నాయకత్వాన్ని పటిష్ఠం చేసుకుని అధిష్ఠాన వర్గ సంస్కృతిని కొనసాగించారు. ఈ యువ నాయకురాలు దేశానికి కొత్త ప్రజాస్వామిక నాయకత్వ వెలుగులను ఇవ్వలేకపోయారు. దేశ పాలనా వ్యవహారాలు, ఎన్నికల రాజకీయాలలో ధోరణులను నేను చాలా కాలంగా విశ్లేషిస్తూ వస్తున్నాను. 1964లో జవహర్‌లాల్ నెహ్రూ కీర్తిశేషుడు అయిన నాటి నుంచి ప్రస్తుత దశకం దాకా దేశ నాయకత్వంలో తరాల మార్పుకు మంచి అవకాశాలు మూడుసార్లు తప్పిపోయాయని నా విశ్లేషణల్లో అవగతమయింది. ఐదేళ్ల వ్యవధిలో తరం మార్పు జరగడమనేది అసంభవం. అయితే ఒక దశాబ్ద కాలంలో అటువంటి మార్పుకు కనీసం సూచనలు తప్పక కనిపిస్తాయి. 1967 నుంచి 1987 మధ్య కాలంలో తరం మార్పుకు మొదటి మంచి అవకాశం తప్పిపోయింది. ప్రస్తావిత రెండు దశాబ్దాల కాలంలో కనీసం మూడుసార్లు తరం మారనున్నదనే సూచనలు మెరిశాయి. యువజనులు ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులు మున్నెన్నడూ లేని విధంగా దేశ వ్యవహారాలలో తమ ఉనికిని బలంగా చాటారు. 1967లోనే 29 ఏళ్ల యువకుడు ఒకరు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. ఎటువంటి రాజకీయ కుటుంబ నేపథ్యం లేకపోగా మైనారిటీ మత వర్గానికి చెందిన ఆ యువకుడు మొత్తం మూడుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి ఎమ్ఓహెచ్ ఫరూఖ్ (1937-2012) గురించి నేను ప్రస్తావిస్తున్నాను. 1970వ దశకం తొలినాళ్లలో గుజరాత్ విద్యార్థులు ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి వల్ల తమకు జరుగుతున్న అన్యాయాలపై తిరుగుబాటు చేశారు. నవ నిర్మాణ్ సమితిగా సంఘటితమయ్యారు. ఆ విద్యార్థి ఉద్యమం బిహార్‌కు వ్యాపించింది. ఆ రాష్ట్రంలో అది లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ సంపూర్ణ విప్లవం ఉద్యమానికి భూమిక అయింది. ఈ ఉద్యమం నుంచి ప్రభవించిన పలువురు యువ నేతలు ఆ తరువాత దేశ ప్రధాన స్రవంతి రాజకీయాలలో అంతర్భాగమయ్యారు. 1977లో జాతీయ స్థాయిలో నాయకత్వం మార్పుకు అవకాశం వచ్చినప్పుడు ఆ యువ నాయకులలో ఏ ఒక్కరికీ అధికార అందలాలు దక్కలేదు. ఎనిమిది దశాబ్దాలకు పైగా వయసున్న ఒక వృద్ధనేత ప్రధానమంత్రి అయ్యారు. అయితే పట్టుమని రెండున్నర సంవత్సరాలు కూడా ఆయన ఆ పదవిలో కొనసాగలేకపోయారు. 1985లో ఈశాన్య భారతదేశంలో ఒక విద్యార్థి నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. అదృష్టవశాత్తునో లేదా యాదృచ్ఛికంగానో ఆయనకు ఆ పదవి లభించలేదు. ఒక చరిత్రాత్మక విద్యార్థి ఉద్యమం కారణంగానే ఆ యువ నేతకు ఆ ఉన్నతి లభించింది. ఇదే కాలంలో, ఆ తరువాత ఎంతో మంది యువ నేతలకు స్ఫూర్తిగా వెలుగొందిన ఒక యువ నాయకురాలు దేశంలో ప్రప్రథమంగా అత్యంత చిన్న వయసులో రాష్ట్ర కేబినెట్ మంత్రి అయ్యారు. 25 సంవత్సరాల వయసులోనే మంత్రి అయిన సుష్మాస్వరాజ్ గురించి నేను ప్రస్తావిస్తున్నాను. అప్పట్లో ఆమె పార్టీకి లోక్‌సభలో కేవలం ఇద్దరు సభ్యులు మాత్రమే ఉండేవారు. యువతరాన్ని తమ పార్టీ వైపు ఆకర్షించడంలో ఆ యువ నాయకురాలు విశేషంగా కృషి చేశారు. ఈ సందర్భాలు అన్నీ దేశ నాయకత్వంలో తరం మార్పుకు దోహదం చేసి ఉండాల్సింది. కానీ అలా జరగలేదు. దేశానికి అవసరమైన తరం మార్పుకు మంచి అవకాశాలు వ్యర్థమైపోయాయి. 1992-2004 సంవత్స రాల మధ్య కాలంలో కూడా తరాల మార్పుకు మరో అవకాశం తప్పిపోయింది. కేంద్రంలో అనిశ్చితి నెలకొని వున్న కాలమది. ఆ కాలంలో దీక్షాదక్షతలు ఉన్న ఒక యువ ముఖ్యమంత్రి రెండుసార్లు ప్రధానమంత్రి పదవికి యోగ్యులైన నేతలను ఎంపిక చేయడంలో కీలక పాత్ర వహించారు. అయితే ఆ యువ ముఖ్యమంత్రి జాతీయ స్థాయిలో కీలక స్థానానికి రాలేకపోయారు. అలా జరిగి ఉన్నట్టయితే తరాల మార్పుకు అది ఆరంభమయి ఉండేది. తరాల మార్పునకు దోహదం చేయగల శక్తి సామర్థ్యాలు ఉన్న ఒక వ్యక్తి ఇప్పుడు దేశ పాలనకు సారథ్యం వహిస్తున్నారు. మార్పు కోసం ప్రజలు, స్థానిక సమాజాల నుంచి ఉద్యమం అనేది ఏదీ లేకుండా తరం మార్పుకు ఆస్కారమున్న అరుదైన అవకాశం ఇది. ఆ శక్తిమంతమైన వ్యక్తి సంకల్పాలు, నిర్ణయాలు ఎటువంటి మౌలిక మార్పులకు దారితీస్తాయో పార్లమెంటుకు కొత్త భవన నిర్మాణం, దేశ రాజధాని రూపురేఖల నవీకరణే తిరుగులేని నిదర్శనాలు. దేశ నాయకత్వం తరం మార్పులో ఉందని ఎప్పుడు చెప్పగలుగుతాము? ఈ పరివర్తన ప్రక్రియకు నాలుగు అంశాలు దోహదం చేస్తాయి.

# శృతి మించుతోన్న కూటమి సర్కార్ అరాచకాలు

## - కల్తీ మద్యం కుంభకోణంపై డైవర్షన్ పాలిటిక్స్ - సాక్షిపై కేసులు పత్రికా స్వేచ్ఛపై దాడి

## - నెల్లూరు ఎమ్మెల్యే థామస్ వ్యాఖ్యలు హేయం : జమ్మలమడక నాగమణి



**కాకినాడ, (రాజధాని వార్తలు):** దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూసేలా సంక్షేమ పాలన అందించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మల మడక నాగమణి తెలిపారు. గురువారం రాష్ట్రంలో జరుగుతున్న కూటమి ప్రభుత్వ ఆరాచక పాలనపై ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు.

**పరిపాలనలో జగన్‌నే ఆదర్శం**

పరిపాలనలో, సంక్షేమంలో ఎవరైనా అనుసరిం చాల్సిన మోడల్ జగన్‌దే. మద్యం అమ్మకాల్లో క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని వైసీపీ ప్రభుత్వం తొలిసారిగా అమలు చేసింది. అదే విధానాన్ని ఇప్పుడు కూటమి ప్రభుత్వం కాపీ చేస్తోందన్నారు.

**సాక్షిపై కేసులు..**

పత్రికా స్వేచ్ఛపై దాడి సాక్షి దినపత్రికపై పోలీ సులు వ్యవహరిస్తోన్న తీరు దుర్మార్గమని, ప్రజా స్వామ్య విలువలకు ముప్పు అని నాగమణి తీవ్రంగా విమర్శించారు. ప్రజాకంటక పాలనను నిలదీస్తున్న సాక్షిపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. విజయవాడ, నెల్లూరు కార్యాలయాలపై పోలీసులు దాడులు చేసి భయాందోళనలు సృష్టించారు. వాస్తవాలను ప్రజలకు చేరుస్తున్న సాక్షిపై జులు ప్రదర్శిస్తూ పైశాచిక ఆనందం పొందుతోంది చంద్ర బాబు ప్రభుత్వం అని మండిపడ్డారు. విశాఖలో గూగుల్ సెంటర్‌పై వ్యంగ్యం విశాఖలో గూగుల్ ఏఐ సెంటర్ ప్రారంభించి అదేదో మహాసాధన చేసినట్టు జబ్బలు చరుచుకుంటున్నారు. అదే విశా ఖలో జగన్ అడుగులు పడిన విషయం గుర్తుందా?" అని ప్రశ్నించారు. ఆమె కూటమి ప్రభుత్వాన్ని ఉద్దేశించి, గతంలో వైసీపీ ప్రభుత్వం గౌతం అదానీ సంస్థతో చేసిన ఒప్పందం పూర్తిగా కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోండని డిమాండ్ చేశారు. మహిళల పట్ల హేయమైన వ్యాఖ్యలు చర్యలు తీసు కోండని నాగమణి ఆగ్రహంతో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మహిళల పట్ల అనుచిత ప్రవర్తన పరిపా టిగా మారింది. గంగాధర నెల్లూరు వైసీపీ సమన్వ యకర్త కృపాలక్ష్మీపై ఎమ్మెల్యే థామస్ చేసిన వ్యాఖ్యలు హేయమైనవి. ఆయనపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల పట్ల గౌరవం నేర్చుకోవాలంటే మా అధినేత జగన్ ని చూసి నేర్చు కోవాలని హెచ్చరించారు. కల్తీ మద్యం కుంభకోణం పై డైవర్షన్ పాలిటిక్స్ నకిలీ మద్యం వ్యవహారంలో కూటమి ప్రభుత్వం పీకల్లోతు కష్టాల్లో మునిగి, ప్రజల దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ ఆడుతోం దని నాగమణి తీవ్రంగా విమర్శించారు. ప్రజలను మోసం చేసే చవకబారు రాజకీయాలు కాకుండా, సమస్యలకు సమాధానం చెప్పే ధైర్యం చూపాలిని వ్యాఖ్యానించారు.

# బాణాసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించి ప్రజలందరూ అహ్లాదకరమైన వాతావరణంలో దీపావళి పర్వదినాన్ని సంతోషంగా జరుపుకునేలాగ దీపావళి బాణసంచా తయారీ దారులు, విక్రయదారులు సహకరించాలని అసిస్టెంట్ అగ్నిమాపక అధికారి జగన్నాథం శ్రీహరి అన్నారు. పెద్దాపురం తహశీల్దార్ కార్యాలయంలో బాణాసంచా తయారీదారులు, తాత్కాలిక విక్రయదారులతో సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే ఈ సంవత్సరం దీపావళి సామాగ్రి తాత్కాలిక విక్రయదారులకు ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసిందన్నారు. ప్రభుత్వం నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, నిరంతరం తయారీదారులు, విక్రయదారులపై నిఘా ఉంచినట్లు తెలిపారు. ఈ విషయాలు గమనించి బాణాసంచా విషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. ఎవరూ నిబంధనలు



మీరినా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చ రించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సి.హెచ్. వెంకట లక్ష్మీ, ఎస్సై వి మౌనిక, బాణాసంచా తయారీదారులు, విక్రయదారులు పాల్గొన్నారు.

# పేదరికం పోవాలంటే చదువు ఒకటే మార్గం

## - విద్యార్థులు ఉన్నత విద్యలలో రాణించాలి - మండల పరిషత్ ఉపాధ్యక్షులు శివుని నరసింహారెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పేదరికం పోవాలంటే చదువు ఒక్కటే మార్గం అని మండల పరిషత్ ఉపాధ్యక్షులు శివుడు నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోవూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గత సంవత్సరం 10 వ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కూలు ఉపాధ్యాయ సిబ్బంది సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోవూరు మండల పరిషత్ ఉపాధ్యక్షులు శివుని నరసింహారెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి ప్రతిభ కనబరిచారని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మంచి మార్కులు సాధించారని తెలిపినారు. అలాగే భవిష్యత్తులో ఉన్నత చదువులలో రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు గ్రామానికి మంచి పేరు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ: 10,116/ వంతున రూ:30,348/ తన స్వంత నిధులు అందచేసినారు. అనంతరం ధాత నరసింహులు రెడ్డిని అధికారులు, ఉపాధ్యాయులు సన్మానించినారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, సుబ్బయ్య, ఎండిఓ శ్రీహరి, జడ్పిటిసి సభ్యురాలు కవరగిరి శ్రీలత ఎంఈఓ చెంచులక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిఎస్టీ 2.0 తో ప్రజలకు మేలు...!

## - అవగాహన ర్యాలీలో డిసిసిబి చైర్మన్ బాబు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** జి ఎస్టీ 2.0తో అన్ని తరగతుల ప్రజలకు మేలు కలుగుతుందని డిసిసిబిచైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. పెద్దాపురం పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం వివిధ వాహనాలు, ఎలక్ట్రానిక్ గూడ్స్, లాజిస్టక్స్ రంగంపై తగ్గించిన "సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్" అంశంపై అవగాహన కార్యక్రమం పెద్దాపురం పట్టణంలో గురువారం నిర్వహించారు. రవాణా శాఖ, రెవెన్యూ, కమర్షియల్ ట్యాక్స్ శాఖల ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ, బైక్ యూనియన్ లతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పెద్దాపురం కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ శ్రీ తుమ్మల రామస్వామి (బాబు) పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. దర్గా నగర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి మీదుగా కొనసాగింది. దీనిలో తగ్గించిన జి ఎస్టీ స్లాబ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెదేపా యువ నాయకులు నిమ్మకాయల రంగనగ్, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరి బాబు రాజు, పెద్దాపురం కౌన్సిలర్ ఓబులుశెట్టి గుణేశ్వరరావు, పెద్దాపురం జనసేన పార్టీ అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు, సామర్లకోట జనసేన పార్టీ అధ్యక్షులు దొమ్మేటి శ్రీనివాస్ (సరోజ్ వాస్), పిట్టా జానకిరామారావు, పెద్దాపురం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ వంగలపూడి సతీష్, గౌరవ అధ్యక్షులు కటారి శీను, యువత అధ్యక్షులు లక్ష్మణ్ దివాకర్, నామా సతీష్, బెందులూరి స్వామి, ఖండవల్లి సత్య, పెద్దాపురం నియోజవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రుయా ఆసుపత్రిలో తొలగించిన 50 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

**తిరుపతి, (రాజధాని వార్తలు):** రుయా ఆసుపత్రిలో దాదాపు 20 ఏళ్ల పైబడి పని చేస్తున్నటువంటి కార్మికులను కొత్తగా కాంట్రాక్ట్ తీసుకునటువంటి పద్మావతి కంపెనీ కాంట్రాక్టర్ భాస్కర్ నాయుడు టెండర్ తీసుకుని ఎనిమిది రోజులు పని చేయించుకుని తొమ్మిదవ రోజు నుంచి మీరు 50 సంవత్సరాలు పై బడింది కాబట్టి రేపటి నుంచి పనిలోకి రావద్దని హఠాత్తుగా కార్మికులను తొలగించారు. ఎన్నో ఏళ్ల నుండి పని చేస్తున్నటువంటి కార్మికులను తొలగించడం సరైన విధానం కాదని గురువారం డీసీఎల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించి ఏసీఎల్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కార్మికులు గత ఆరు రోజులుగా రుయా ఆసుపత్రి ప్రాంగణంలో నిరసన తెలుపుతున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుబ్రమణ్యం, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్ జయచంద్ర, రుయా ఆసుపత్రి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వేణుగోపాల్, సిఐటియు నగర అధ్యక్షురాలు పి బుజ్జి, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు జి చినబాబు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుయా ఆసుపత్రి రాయలసీమ జిల్లాలోనే తలమాణికంగా ఉన్న అతిపెద్ద ఆసుపత్రి 1260 బెడ్ల సామర్థ్యం గల ఆసుపత్రి 1260 బెడ్లకు దాదాపు 600 మంది పైచిలుకు



కార్మికులు అవసరం ఉంటే కేవలం రెండు మూడు వందల మంది కూడా పనిచేసే పరిస్థితులు ఈ ఆస్పత్రిలో లేదు. సమస్యల వలయంలో రుయా ఆసుపత్రి ఉన్నది. సమస్యలు పరిష్కరించాల్సింది పోయి మరికొన్ని సమస్యలు పెంచే విధంగా అక్కడ పరిస్థితులు పరిణామాలు జరుగుతున్నాయని అన్నారు. గత 20 ఏళ్ల నుండి పనిచేస్తున్నటువంటి కార్మికులను అనుభవం కలిగి ఉన్న కార్మికులను పనులు చేయకపోతే పనులలో ఏమైనా లోపాలు ఉంటే సరిదిద్దుకో మని చెప్పాలి పనిచేయడం లేదంటే తొలగించాలి తప్ప బాగా పని చేస్తున్నటువంటి కార్మికులను కరోనా సమయంలో ఒక్కొక్క కార్మికుడు కార్మికురాలు 10 వార్డులు 12 వార్డులు శ్రమించి పనిచేసిన అను భవం కలిగినటువంటి కార్మికులను అర్ధాంతరంగా తొలగించడం చట్ట విరుద్ధం అన్యాయం అని తెలిపారు. కాంట్రాక్టర్ ఏది అనుకుంటే అది చట్టం కాదని కాంట్రాక్టర్ రాసుకున్న ఎం ఓ యు కార్మిక చట్టం కాదని కార్మిక చట్టం ప్రకారం కాంట్రాక్ట్ కార్మికుడు 60 సంవత్సరాల వరకు పనిచేయచ్చని ఈ విషయాన్ని కాంట్రాక్టర్ తెలుసుకోవాలి ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలు ఉంటే ఈ రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికుల వయసు 50 సంవత్సరాలు దాటితే పని చేయకూడదని ఏ చట్టం లో ఉందని, ఆ రకంగా ఏ ప్రభుత్వము తీర్మానం చేయలే దని ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న భాస్కర్ నాయుడు తీరు సరైన విధానం కాదని తన వైఖరి మార్చుకొని తొలగించిన 50 మంది కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకొని యధాతథంగా పనుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏసీఎల్ ధర్నా కార్యక్రమం వద్దకు విచ్చేసి కార్మికులు ఇచ్చిన వినతి పత్రాన్ని స్వీకరించి ఈ రకంగా అర్ధాంతరంగా తొలగించడం అన్యాయమని కచ్చితంగా కార్మికులందరికీ న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా కార్యక్రమాన్ని విరమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రభాకర్ తొలగించిన కార్మికులు లక్ష్మమ్మ, రాణి, లక్ష్మమ్మ, ఎస్ బిబి, పి సుబ్రహ్మణ్యం, రామ్మూర్తి, సుబ్రహ్మణ్యం, లక్ష్మీదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సుధీర్ బాబు 'జటాధర' ట్రైలర్.. ఇది ధన పిశాచి ఆట




టాలీవుడ్ నవ దళపతి సుధీర్ బాబు ఎప్పుడు విభిన్న కథలు, వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటారన్న విషయం తెలిసిందే. ఇప్పుడు సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ జటాధరలో యాక్ట్ చేస్తున్నారు. థ్రిల్లర్ అంశాలతో.. డివోషనల్ టచ్ బ్యాక్ డ్రాప్ తో రూపొందుతున్న ఆ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్స్, లుక్స్, సాంగ్స్, టీజర్ మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. ఆడియన్స్ లో సూపర్ బజ్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు ఆ జోష్ తో మేకర్స్.. ట్రైలర్‌ను శుక్రవారం సాయంత్రం తీసుకొచ్చారు.

సూపర్ స్టార్ మహేష్ బాబు చేతుల మీదుగా సోషల్ మీడియాలో ట్రైలర్‌ను రిలీజ్ చేయించారు మేకర్స్. గూస్ బంప్స్ తెప్పించే సీన్స్‌తో ట్రైలర్ స్టార్ట్ అవ్వగా.. బ్యాక్ గ్రౌండ్‌లో ఆసక్తి రేపే డైలాగ్ వచ్చింది. పూర్వం ధనాన్ని భూమిలో దాచి పెట్టి మంత్రాలతో బంధనాలు వేసేవారు. వాటిలో భయంకరమైనది పిశాచి బంధనం అంటూ బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హాను చూపించారు మేకర్స్. ఈ సినిమాతో ఆమె టాలీవుడ్‌లోకి వస్తోంది. ఆ తర్వాత సుధీర్ బాబు స్టైలిష్ లుక్‌లో ఎంట్రీ ఇచ్చారు. పారానార్మల్ కార్యకలాపాలను నమ్మని పారానార్మల్ పరిశోధకుడిగా కనిపించారు. ధన పిశాచి మేల్కొన్నాడని తెలుసుకుని ఆమెను ఆపడానికి మార్గాలు కనుగొనడం ప్రారంభిస్తారు. దెయ్యాలను వేటాడే హీరో.. అతడి చుట్టూ జరిగే ధన పిశాచి ఆట.. ఇదే మూవీగా తెలుస్తోంది. అయితే సుధీర్ బాబు మరోసారి తన నటనతో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. శివుని త్రిశూలంతో నడిచేటప్పుడు భక్తుడిగా, ఆ తర్వాత స్టైలిష్ లుక్స్‌తో ఆకట్టుకున్నారు. ట్రైలర్ చివరి సీన్ తో గూస్ బంప్స్ తెప్పించారు. సోనాక్షి సిన్హా.. జటాధర మూవీలో సరికొత్త పాత్రలో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది. ట్రైలర్ లోని గ్రాఫిక్స్, విజువల్స్ సూపర్ గా ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. సిల్వర్ స్క్రీన్ పై విజువల్ ఫీస్ట్‌గా మూవీ ఉంటుందని అర్థమవుతోంది. రాజీవ్ రాజ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్లస్ పాయింట్‌లా నిలిచేలా కనిపిస్తోంది. ప్రతి ఫ్రేమ్‌కు కూడా ఆయన అందించిన నేపథ్య సంగీతం అదిరిపోయిందని చెప్పాలి. నిర్మాతలు ఉమేష్ కుమార్ బన్సాల్, ప్రేరణ అరోరా ఎక్కడా రాజీ పడకుండా సినిమా కోసం ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. దర్శకులు వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ మేకింగ్ అద్భుతంగా ఉన్నట్లు కనిపిస్తోంది. మరి నవంబర్ 7వ తేదీన సినిమా రిలీజ్ కానుండగా.. ఇప్పుడు ట్రైలర్ అంచనాలు పెంచుతూ దూసుకుపోతోంది. మరి మూవీ ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# రాసిపెట్టుకోండి ....రీ రిలీజ్‌తో 100 కోట్ల రికార్డు !





'బాహుబలి'.. కేవలం సినిమా కాదు, ఒక ఎమోషన్. పదేళ్ల క్రితం భారతీయ సినిమా రికార్డుల తలరాతను మార్చిన ఈ అద్భుతం, ఇప్పుడు 'ది ఎపిక్'గా రీ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. అయితే ఇది మామూలు రీ రిలీజ్ కాదు, ఆల్ టైమ్ రికార్డులను సెట్ చేసేలా కనిపిస్తోంది. ముఖ్యంగా యూఎస్‌ఏలో విడుదలకి 12 రోజుల ముందే ప్రీమియర్ బుకింగ్స్‌తో సృష్టిస్తున్న సంచలనం చూసి, ట్రేడ్ పండితులు సైతం షాక్ అవుతున్నారు.

యూఎస్‌ఏ బాక్సాఫీస్ వద్ద 'బాహుబలి: ది ఎపిక్' ప్రీమియర్ల హవా మామూలుగా లేదు. కేవలం ప్రీమియర్ బుకింగ్స్‌తోనే ఈ చిత్రం $100K (సుమారు రూ.84 లక్షలు) మార్క్‌ను దాటేసింది. ఇది రీ రిలీజ్‌ల చరిత్రలోనే ఒక సరికొత్త రికార్డు. మెగాస్టార్ 'ఇంద్ర' ($65K), పవన్ కళ్యాణ్ 'గబ్బర్ సింగ్' ($59K), మహేష్ బాబు 'ఖలేజా' ($58K) వంటి చిత్రాల లైఫ్ టైమ్ రీ రిలీజ్ గ్రాస్‌ను, 'బాహుబలి' కేవలం ప్రీమియర్లతోనే క్రాస్ చేసేసింది. ఈ ట్రెండ్ చూశాకే ఒక కొత్త చర్చ మొదలైంది. ఫ్యాన్స్, ట్రేడ్ వర్గాల్లో ఇప్పుడు ఒకే మాట వినిపిస్తోంది. "భారతీయ సినిమా చరిత్రలో రీ రిలీజ్‌లో 100 కోట్లు వసూలు చేసిన మొదటి చిత్రంగా 'బాహుబలి: ది ఎపిక్' నిలుస్తుందా?" ఈ ప్రశ్న వినడానికి చాలా ఎగ్జయిటింగ్‌గా, కాస్త అతిశయోక్తిగా అనిపించినా, ప్రస్తుత బజ్ చూస్తుంటే అసాధ్యమని కొట్టిపారేయలేం. ఒకవేళ ఇది నిజంగా జరిగితే, అది రీ రిలీజ్ మార్కెట్‌కే ఒక కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేస్తుంది. ఈ నమ్మకం వెనుక కొన్ని బలమైన కారణాలు ఉన్నాయి. ఇది కేవలం పాత సినిమాను మళ్లీ వేయడం కాదు. రెండు భాగాలను కలిపి, కొత్త సన్నివేశాలను జోడించి, 3 గంటల 44 నిమిషాల నిడివితో ఒక సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరి యన్స్‌గా అందిస్తున్నారు. 'RRR' తర్వాత రాజమౌళికి గ్లోబల్‌గా పెరిగిన బ్రాండ్ ఇమేజ్, ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ ఈ సినిమాకు అతిపెద్ద ప్లస్ పాయింట్స్. అయితే, ఈ 100 కోట్ల టార్గెట్ అంత సులభం కాదు. దాదాపు నాలుగు గంటల నిడివి ప్రేక్షకుడి సహనానికి పెద్ద పరీక్ష. సినిమాను ఇప్పటికే టీవీల్లో, ఓటీటీలో బాగా చూసిన ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించడం ఒక సవాల్. ప్రీమియర్ల హవా తర్వాత కూడా అదే ఊపును కొనసాగించడం చాలా ముఖ్యం. లాంగ్ రన్ నిలబడితేనే ఈ ఫీట్ సాధ్యమవుతుంది.

ఏది ఏమైనా, 100 కోట్లు అనేది చాలా పెద్ద టార్గెట్. కానీ, రికార్డులు బ్రేక్ చేయడానికే ఉన్నాయని నమ్మే రాజమౌళి, ప్రభాస్ కాంబోలో వస్తున్న సినిమా కాబట్టి, దేనినీ కొట్టిపారేయలేం. అక్టోబర్ 31న అసలు మ్యాజిక్ మొదలవుతుంది. ఏది ఏమైనా ఈ సినిమా ఆ మార్క్‌ను అందుకున్నా, అందుకోకపోయినా.. తప్పకుండా ఒక కొత్త ట్రెండ్ అయితే సెట్ చేస్తుందని అంటున్నారు.

# 'కింగ్ 100' లో టాలీవుడ్ క్వీన్ స్వీటీ...?





నాగార్జున హీరోగా గత ఏడాది సంక్రాంతికి 'నా సామి రంగ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా తీవ్రంగా నిరాశ పరచడంతో కథల ఎంపిక విషయంలో నాగ్ ఆచితూచి వ్యవహరిస్తున్నాడు. ఆయన చాలా గ్యాప్ తీసుకుని ఈ ఏడాది కుబేరా, కూలీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన కుబేరా సినిమాలో నాగార్జున ముఖ్య పాత్రలో నటించాడు. ఆ సినిమాకు మంచి టాక్ వచ్చింది. అయితే నాగార్జున పాత్ర విషయంలో ఫ్యాన్స్ సంతృప్తిగా లేరని చెప్పాలి. ఇక రజనీ కాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన కూలీ సినిమాలో నాగార్జున నెగటివ్ రోల్‌లో కనిపించాడు. ఆ పాత్రకు పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. అయితే సినిమా కమర్షియల్‌గా ఆశించిన స్థాయిలో ఆడలేదు. కూలీ సినిమాలో ఏదో మిస్ అయింది అంటూ రివ్యూవర్స్ నెగటివ్ రివ్యూలు ఇచ్చారు. ఒకానొక సమయంలో ఏడాదిలో మూడు నాలుగు, అంతకు మించి సినిమాలతో వచ్చిన నాగార్జున ఇప్పుడు హీరోగా ఏడాదికి కనీసం ఒక్క సినిమాను సైతం విడుదల చేయక పోవడం అభిమానులకు తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. ఎట్టకేలకు నాగార్జున కొత్త సినిమా ప్రారంభం అయింది. తమిళ దర్శకుడు ఆర్ కార్తీక్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాను నాగార్జున 100వ సినిమాగా ప్రచారం చేస్తున్నారు. ఈ మైల్ స్టోన్ మూవీని నాగ్ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో అఖిల్, నాగ చైతన్య ముఖ్యమైన గెస్ట్ రోల్స్ చేస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆ విషయం గురించి అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. ఇక ఈ సినిమాలో హీరోయిన్స్ గురించి మొదటి నుంచి పుకార్లు షికార్లు చేస్తూనే ఉన్నాయి. తాజాగా మరో ఆసక్తికర పుకారు ఒకటి హీరోయిన్ గురించి రావడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నాగార్జున ఇప్పటికే ఈ 100వ సినిమా షూటింగ్‌లో జాయిన్ అయ్యాడు. అధికారికంగా ప్రకటన వచ్చేది ఎప్పుడు అని అక్కినేని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్న ఈ సినిమా షూటింగ్‌లో ఇటీవలే టబు సైతం జాయిన్ అయిందని వార్తలు వస్తున్నాయి. నాగార్జున, టబు కలయిక అంటే ఫ్యాన్స్ కి పక్కా పైసా వసూల్ అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో టబుతో కలిసి నాగార్జున నటించిన విషయం తెల్సిందే. ఇప్పుడు మరో హీరోయిన్‌గా అనుష్క ఈ సినిమాలో నటించబోతుంది అనే వార్తలు వస్తున్నాయి. సినిమాలో నాగార్జున డ్యూయల్ రోల్ అనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అదే నిజం అయితే రెండో హీరోయిన్‌గా అనుష్క నటించడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అనుష్క కి నాగార్జున అంటే ప్రత్యేకమైన గౌరవం అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ గౌరవంతోనే నాగార్జున 100వ సినిమా కోసం అడిగిన వెంటనే ఓకే చెప్పి ఉంటుందని అంటున్నారు. టాలీవుడ్ క్వీన్‌గా గుర్తింపు దక్కించుకున్న స్వీటీ అనుష్క ఇటీవలే ఘాటీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా కమర్షియల్‌గా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదు. అయినా కూడా నాగార్జున సినిమాలో ఛాన్స్ దక్కించుకుంది. ఈ మధ్య లేడీ ఓరియంటెడ్ సినిమాలు ఎక్కువ చేస్తున్న అనుష్క ఇప్పుడు నాగార్జునకు జోడీగా నటించేందుకు ఓకే చెప్పడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నాగార్జున 100వ సినిమా అంటే చాలా స్పెషల్ మూవీగా ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో అనుష్క సైతం ఈ సినిమాలో ఉండటంతో అంచనాలు మరింతగా పెరిగాయి.

# క్యూట్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్న అదితి



తెలుగు హీరోయిన్ అదితి రావు హైదరి తాజాగా ELLE బ్యూటీ అవార్డ్స్ -2025 ఈవెంట్‌లో బేబీ డాల్‌లా మెరిసింది. తాజాగా ముంబై జూహులోని జె డబ్ల్యూ మారియట్ SSBeauty Presents ELLE బ్యూటీ అవార్డ్స్ తన 19వ ఎడిషన్ నిర్వహించింది. ఇక ELLE బ్యూటీ ప్రేన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ అందుకుంది.. అయితే ఈ అవార్డ్స్ వేడుకలో అదితి రావు హైదరి తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరచింది. బేబీ డాల్ లాంటి డ్రెస్సులో అద్భుతంగా కనిపించింది. గ్లామర్ అందాలు హైలైట్ అయ్యేలా టాప్‌తో పాటు ఓ బెలూన్ లాంటి స్కర్ట్‌తో స్టైల్ చేసింది. ఈ డ్రెస్‌లో అదితీ రావు హైదరి అచ్చం బేబి డాల్ లాగే కనిపిస్తోంది. ఈ డ్రెస్‌కి తగ్గట్టుగానే తన హెయిర్ కట్ కూడా మార్చుకుంది. డ్రెస్‌కు తగ్గట్టుగా హెయిర్ కట్ చేయించుకొని తన కళ్ళతో హైలెట్ చేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలను అదితి రావు హైదరి తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసుకోగా..ఈ ఫోటోలు చూసిన చాలా మంది జనాలు ఇదేంటి అదితి రావు హైదరి లుక్‌ని ఇలా చేంజ్ చేసేసింది అని షాక్ అవుతున్నారు. ఈ బేబీ డాల్ లుక్‌లో అచ్చం బొమ్మలాగే మెరిసిపోతున్నారు అంటూ కామెంట్లు పెడుతున్నారు.. అయితే అదితి రావు హైదరీని ఇంతకు ముందు ఎప్పుడు ఇలాంటి లుక్‌లో చూడలేదు. సడన్గా ఈ ఈవెంట్లో ఫ్యాషన్ ఫార్వర్డ్ దుస్తులలో చూసేసరికి అభిమానులు షాక్ అయిపోతున్నారు. ప్రస్తుతం అదితిరావు హైదరీకి సంబంధించిన ఈ ఫొటోస్ నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ హీరోయిన్ పర్సనల్ ప్రొఫెషనల్ లైఫ్‌కి వస్తే..సత్య దీప్ మిశ్రాని 2002లో పెళ్లాడిన అదితి రావు హైదరి.. పెళ్లైన 10 ఏళ్లకు అంటే 2012లో భర్తకు విడాకులు ఇచ్చేసి మోడలింగ్ రంగంలో రాణించింది. ఆ తర్వాత బాలీవుడ్ లో సినిమాలు, వెబ్ సిరీస్‌లలో రాణించి సౌత్‌లో కూడా కొన్ని సినిమాలు చేసింది. అలా సౌత్‌లో వర్క్ చేస్తున్న సమయంలో మహా సముద్రం సినిమా షూటింగ్‌లో నటుడు సిద్ధార్థ్ తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి గత ఏడాది రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. ఇక పెళ్లి అయిన కొద్ది రోజులకు సిద్ధార్థ్ అదితి రావు హైదరీలు తమ పెళ్లి విషయాన్నీ బయట పెట్టారు. అలా ప్రస్తుతం పర్సనల్ లైఫ్‌తో పాటు ప్రొఫెషనల్ లైఫ్‌లో కూడా దూసుకుపోతుంది అదితి రావు హైదరీ.

# 2.0 సంస్కరణలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి

**- జిఎస్టి తగ్గింపుతో ట్రక్కులు, డెలివరీ వ్యాన్లు వంటి వాహనాల కొనుగోలుపై 28 శాతం వున్న జిఎస్టి 18 శాతానికి తగ్గింది - ట్రాన్స్‌పోర్ట్ వాహనాల ఇన్సూరెన్స్‌పై గతంలో వున్న 18 శాతం జిఎస్టీని 05 శాతానికి తగ్గించారు - రవాణా ఖర్చులు కూడా తగ్గడంతో నిత్యావసర సరకుల ధరలు కూడా తగ్గుతాయి - బస్సులు, మినీ బస్సుల కొనుగోలుపై గతంలో 28 శాతం వున్న జిఎస్టి 18 శాతానికి తగ్గడంతో ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ రంగానికి కూడా ఎంతో మేలు జరిగింది - జిఎస్టి 2.0 సంస్కరణలతో పేద, మధ్య తరగతి వర్గాలు మరియు రైతులకు ఎంతో ప్రయోజనం - జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గడంతో వ్యాపారస్థులతో పాటు వినియోగదారులు కూడా సంతోషంగా వున్నారు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**
















**కోవూరు, (రాజధాని వార్తలు):** జిఎస్టి 2.0 సంస్కరణలతో వస్తు రవాణాలో కీలక పాత్ర పోషించే వాహనాల కొనుగోలు మరియు మెయింటెనెన్స్ కాస్ట్ తగ్గడంతో సరుకుల రవాణా ఖర్చులు తగ్గి నిత్యావసర సరకుల ధరలు ప్రజలకు అందుబాటులోనికి వస్తాయన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిఎస్టి అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని వినియోగ వస్తువుల ధరలు పెరగడం మరియు తగ్గడంలో రవాణా రంగం పాత్ర గురించి ఈ సందర్భంగా ఆమె గణాంకాలతో సహా వివరించారు. కేవలం గూడ్స్ ట్రాన్ పోర్ట్ రంగమే కాకుండా బస్సులు, మినీ బస్సుల కొనుగోలు పై గతంలో 28శాతం వున్న జిఎస్టి 18 శాతానికి తగ్గడంతో ప్యాసింజర్ ట్రాన్స్ పోర్ట్ రంగానికి కూడా ఎంతో మేలు జరిగిందన్నారు. జిఎస్టి 2.0 సంస్కరణలు లాజిస్టిక్ రంగానికి వరంలాంటివన్నారు. జిఎస్టి 2.0 సంస్కరణ లతో ట్రాక్టర్ల తగ్గడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నార న్నారు. గతంలో ఒక ట్రాక్టర్ కొనే రైతు రెండవ ట్రాక్టర్ కొనేం దుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ట్రాన్స్ పోర్ట్ వాహనాల ఇన్స్యూరెన్స్‌పై గతంలో వున్న 18 శాతం జీఎస్టీని 05 శాతానికి తగ్గించడం శుభపరిణామమన్నారు. అన్ని రకాల వస్తువులపై ధరలు తగ్గించి ప్రజల కొనుగోలు శక్తి పెంచి దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తున్న ప్రధానమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు గారికి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు ధన్యవాదాలు తెలియచేసారు. జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గి వ్యాపారస్థులతో పాటు వినియోగదారులు కూడా సంతోషంగా వున్నారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను అధికారులు ప్రజలకు వివరించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో గత 22వ తేదీ నుంచి గ్రామ గ్రామాన అటు వ్యాపారస్థులకు ఇటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి కార్తీక్, బుచ్చి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, వవ్వేరు బ్యాంక్ ఛైర్మన్ దొడ్ల విజయలక్ష్మి, బుచ్చి అగ్రికల్చర్ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మెన్ ఏటూరి శివరామ కృష్ణారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ రామానాయుడు, వైస్ ఛైర్మెన్ పఠాన్ నస్రీన్ ఖాన్, జనసేన నాయకులు చప్పిడి శ్రీనివాసులు రెడ్డి, మాధవరావు, బిజెపి నాయకులు కాసా శ్రీనివాసులతో పాటు బుచ్చి పట్టణ కౌన్సిలర్లు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉంటుంది

**- అసంపూర్తిగా వదిలేసిన గౌడౌన్ నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక పూర్తి చేసాం**
**- గోదాములలో ధాన్యాన్ని నిల్వ చేయడం ద్వారా మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం ఉంటుంది**
**- రైతులు బ్యాంకుల నుండి తక్కువ వడ్డీకి రుణాలు పొందవచ్చు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**











**కొడవలూరు, (రాజధాని వార్తలు):** గుండాలమ్మ పాళెం వ్యవసాయ సొసైటీ 11 కోట్ల 50 లక్షల రూపాయల టర్నోవర్‌తో లాభాల బాటలో ఉందన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. కొడవలూరు మండలం గుండాలమ్మ పాళెం గ్రామంలో 40 లక్షల వ్యయంతో నిర్మించిన వ్యవసాయ సొసైటీ ఎంపీఎఫ్‌సీ గౌడౌన్ను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రారంభోత్సవం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ నాబార్డ్ నుంచి 40 లక్షల రూపాయలు అప్పుగా తీసుకొని నిర్మాణం చేపట్టి సగంలో వదిలేసిన గుండాలమ్మ పాళెం సొసైటీ గౌడౌన్ను కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక పూర్తి నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోనికి తెచ్చామన్నారు. ఏ పంటైనా కోతలయ్యాక మార్కెట్‌లో ధరలు తక్కువగా ఉంటాయని గోదాములలో ధాన్యాన్ని నిల్వ చేయడం ద్వారా, రైతులు మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం ఉంటుందన్నారు. ఎంపీఎఫ్‌సీ గోదాములో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులనే కాకుండా, ఎరువులు, విత్తనాలతో పాటు వ్యవసాయ పనిముట్లను కూడా నిల్వ చేసుకోవచ్చన్నారు. ఈ గోదాములు శాస్త్రీయ పద్ధతులలో నిర్మించడంతో నిల్వ చేసే వ్యవసాయ ఉత్పత్తులకు తేమ, పురుగులు, ఎలుకల నుండి పంటకు నష్టం జరగకుండా నివారించవచ్చన్నారు. రైతులు తమ పంటను గోదాములో నిల్వ చేయడం ద్వారా బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలు పొందవచ్చన్నారు. గుండాలమ్మ పాళెం వ్యవసాయ సొసైటీ పరిధిలో 1 వెయ్యి 32 మంది సభ్యులున్నారని గత ఆర్థిక సంవత్సరంలో 8 కోట్ల 95 లక్షల రూపాయలు స్వల్ప కాలిక, 22 లక్షల దీర్ఘ కాలిక రుణాలిచ్చి రైతులకు ఆర్థికంగా అండగా నిలిచిందన్నారు. రైతులకు 2 కోట్ల 50 లక్షల క్రాప్ లోన్స్ యిచ్చి 6 లక్షల ఆదాయంలో వున్న గుండాలమ్మ పాళెం వ్యవసాయ సొసైటీ భవిషత్తులో ఇంకా మెరుగైన పనితీరు కనబర్చి రైతులకు బాసటగా నిలవాలని కొత్తగా ఎన్నికైన సొసైటీ కార్యవర్గానికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మెన్ బద్వేలు వినీల్ రెడ్డి, సొసైటీ కార్యవర్గ సభ్యులు పల్లంరెడ్డి సాయి మోహన్ రెడ్డి, పంది శ్రీనివాసులు, ఎంపీటీసీ గరికపాటి రాజా, కొడవలూరు టిడిపి అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు అమరేంద్ర రెడ్డి, మందపాటి రమణారెడ్డి, కరకట్ట మల్లికార్జునలతో పాటు టిడిపి యూనిట్, క్లస్టర్ ఇంచార్జీలు మరియు మండల టిడిపి నాయకులూ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలు చెల్లించండి : చల్లకొలుసు మల్లికార్జున




**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** బుచ్చిరెడ్డిపాళెం సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్నం పథకం కార్మికులు మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం ఎంఈఓ దిలీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున రావు మాట్లాడుతూ కార్మికులకు జులై, ఆగస్టు నెలలకు సంబంధించి వేతన బకాయిలు, బిల్లులు చెల్లించలేదన్నారు. భోజన నిర్వాహకుల ఖాతాలలో జమైనట్లు మెసేజ్లు పంపేరే కానీ వారి ఖాతాలకు డబ్బులు జమ కాలేదు. అప్పులు చేసి ప్రతినెల పిల్లలకు వండి పెడుతున్నామని తామిద్దరం పేదవారని వెంటనే తమ ఖాతాలకు వేతన బాకాయిలు చెల్లించాలన్నారు. సివిల్ సప్లై అధికారులు పిల్లలకు వండి పెట్టే బియ్యం నేరుగా పాఠశాలలకు పంపాలన్నారు. క్లస్టర్ నుంచి తాము బియ్యం తెచ్చుటకు తమకు రవాణా చార్జీలు 200 రూపాయలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయాలకు, భోజనం కార్మికులకు జీతాలు పెంచా లని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ప్రకారం 26,000 ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేసారు. ప్రతినెల 5వ తేదీ లోపల వేతనాలు, బిల్లులు చెల్లించాలన్నారు. గ్యాస్ పిల్లలకు వంట వండి పెట్టేందుకు ప్రభుత్వం వారే సప్లై చేయాలన్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా ఎంఈఓ సమావేశాన్ని నిర్వహించాలని, క్రీడా ఉత్సవాలు, పేరెంట్స్ మీటింగ్ లకు తాము వండి పెట్టిన భోజనానికి బిల్లులు చెల్లించడం లేదని ఇవన్నీ కూడా చెల్లించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణమ్మ, గాయత్రి, సునీత, దిల్షాద్, సుజాత, విజయ ఆయాలు రమణమ్మ, ఆశ్రమం తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా నవీకరణ పారదర్శకంగా నిరంతరంగా కొనసాగుతుంది : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఓటర్ల జాబితా నవీకరణ పారదర్శకంగా నిరంతరంగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. గురువారం కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ చాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫారం 6 లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫారం 6 లను సంపూర్ణంగా పూర్తిచేసే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు నూతన ఓటర్లకు అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా చనిపోయిన వారిని ఓటరు జాబితా నుండి తొలగించేందుకు వారి మరణ ధ్రువీకరణ పత్రాలను పొందే విధంగా వారి కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో డి ఆర్ ఓ విజయ్ కుమార్, టిడిపి – రసూల్, వై ఎస్ ఆర్ సి పి – వెంకట శేషయ్య, బీఎస్పీ – శ్రీరామ్ తదితరులు హాజరయ్యారు.

# ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి : ఏ ఎం సి డైరెక్టర్ బోలా శీను



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రధాని చేయని అభివృద్ధి నరేంద్ర మోదీ చేశారని సర్వేపల్లి నియోజకవర్గ ఏఎంసి డైరెక్టర్ బోల శీను పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థి డబ్బు ఇవ్వకపోయిన గెలిచే పరిస్థితి లేకపోయినా ఒక భారతీయుడిగా బీజేపీ కే ఓట్ వెయ్యండి. యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమే అనేది చరిత్ర చెబుతున్న బలమైన సత్యం మీతో మీ రాబోయే భావితరాలకు మెరుగైన మంచి ఆరోగ్యకరమైన ఆనందకరమైన సమాజాన్ని సృష్టించేందుకు మీవంతు బాధ్యతగా భావించి కృషి చేయండి ఇకనుంచి జరగబోయే వార్డు మెంబర్ ఎన్నికల నుంచి ప్రతీ ఎన్నికల్లోనూ భారతీయ జనతాపార్టీ గెలుపు కోసం ఇతర పార్టీలు డబ్బుతో నడుస్తాయి కాని బీజేపీ లాంటి సిద్ధాంతాలు గల పార్టీ వీటికి భిన్నంగా ఉంటుంది. ఒక మనిషి బీజేపీ పార్టీకి రావడమే గొప్ప పని. అలాంటిది అన్ని పార్టీలల డబ్బు ఆశించడం మనకి సబబు కాదు. బీజేపీలో ఉండటమే ఒక మంచిపని దేశసేవగా భావిస్తారు.. బీజేపీ నుంచి నిలబడటమే గొప్ప పనిగా భావించండి. బీజేపీకి ఓట్ వేసి బీజేపీ మరియు మోడీ విలువ పెంచండి అని పిలుపునిచ్చారు.

# వి ఆర్ కృష్ణ తేజని మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీధర్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మరియు రూరల్ డెవలప్మెంట్ శాఖ కమిషనర్, వి.ఆర్. కృష్ణ తేజ మైలవరపుని, తాడేపల్లిలోని సంబంధిత శాఖ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఆత్మకూర్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ నల్లిసెట్టి శ్రీధర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గం ఇంచార్జ్ నలిశెట్టి శ్రీధర్, నెల్లూరు నగర జనసేన పార్టీ అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ బాబు, నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు మరియు రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తీగల చంద్రశేఖర రావు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించడం జరిగింది. ఆయనను శాలువాతో సత్కరించి పూల మొక్కను బహుకరించడం జరిగింది. జనసేన పార్టీని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# అశోక్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు : ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకట్




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మరియు జొన్నవాడ దేవస్థానం చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డికి జన్మదిన సందర్భంగా, కోవూరు నియోజకవర్గ ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి నాటక రాణివెంకట్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని హృదయపూర్వకంగా దేవుని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన మరెన్నో పదవులు అలంకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యల పరిష్కరించాలని గురువారం మధ్యాహ్నం భోజనం పథకం కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ముందు నిరసన నిర్వహించి అనంతరం ఎంఈఓ దిలీప్ కుమార్కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున రావు మాట్లాడుతూ కార్మికులకు జులై, ఆగస్టు నెలలకు సంబంధించి వేతన బకాయిలు, బిల్లులు చెల్లించలేదన్నారు. భోజన నిర్వహకుల ఖాతాలలో జమైనట్లు మెసేజ్లు పంపేరే కానీ వారి ఖాతాలకు డబ్బులు జమ కాలేదు. అప్పులు చేసి ప్రతినెల పిల్లలకు వండి పెడుతున్నామని తామిద్దరం పేదవారని వెంటనే తమ ఖాతాలకు వేతన బాకాయిలు చెల్లించాలన్నారు. సివిల్ సప్లై అధికారులు పిల్లలకు వండి పెట్టే బియ్యం నేరుగా పాఠశాలలకు పంపాలన్నారు. క్లస్టర్ తాము బియ్యం తెచ్చుటకు తమకు రవాణా చార్జీలు 200 రూపాయలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయాలకు, భోజనం కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ప్రకారం 26,000 ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేసారు. ప్రతినెల 5వ తేదీ లోపల వేతనాలు, బిల్లులు చెల్లించాలన్నారు. గ్యాస్ పిల్లలకు వంట వండి పెట్టేందుకు ప్రభుత్వం వారే సప్లై చేయాలి అన్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా ఎంఈఓ సమావేశాన్ని నిర్వహించా లని, క్రీడా ఉత్సవాలు, పేరెంట్స్ మీటింగ్లకు తాము వండి పెట్టిన భోజనానికి బిల్లులు చెల్లించడం లేదని ఇవన్నీ కూడా చెల్లించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణమ్మ, గాయత్రి, సునీత, దిల్షాద్, సుజాత, విజయ ఆయాలు రమణమ్మ, ఆశ్రమం తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లో బాగా రాణించాలి

## - యానాదుల హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** గిరిజన విద్యార్థిని విద్యార్థులు చదువులో బాగా రాణించి ఉన్నత శిఖరాలు అందుకోవాలని యానాదుల హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ కార్యదర్శి పోట్లూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన బిడ్డలు, పేదరికం పోవాలంటే చదువు ఒక్కటే మార్గం అని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం పంచాయతీలోని వినాయక గిరిజన కాలనీలోని చల్లా యానాధుల బాలబాలికలకు బిస్కట్ పాకెట్స్ ఆయన అందజేశారు. PSVRMA గిరిజన సేవా సంగం ప్రధాన కార్యదర్శి చచ్చాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# యాజమాన్య పద్ధతులపై మామిడి రైతులకు అవగాహన




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం చిన బ్రహ్మదేవం, కొండపల్లి గ్రామాల్లో మామిడి, జీడిమామిడి రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులపై ఉద్యానవన అధికారి కే సత్య శైలజ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన పరిశోధనా స్థానం, పెద్దాపురం శాస్త్రవేత్త డా. సునీత మామిడి, జీడిమామిడి రైతులకు నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎరువుల వాడకం, జీడిమామిడికి కాపు అయిన వెంటనే కొమ్మ కత్తిరింపులు చేసుకోవడటంతో పాటు పూత సమయంలో 'టీ' మస్కిటి బగ్ వంటి పురుగుల నివారణకు మందులను మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఉద్యావన అధికారి శైలజ ఆయిల్ పామ్ సాగులో మామిడి, జీడిమామిడి, జామ, బొప్పాయి కూరగాయల సాగుకు అందించే ప్రోత్సాహకాలను వివరించారు. అలాగే సామూహి కంగా పండు ఈగ నివారణకు మామిడి రైతులు మిథైల్ యూజినాన్ ఆబంతి ఏర్పాటు చేసుకోవడం, మామిడి రైతులకు వాడాలని తెలిపారు. ఏపీ ఎమ్ఐపి పిడి జివివి ప్రసాద్ డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ కొరకు రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ద్వారా రాయితీలను పొంద వచ్చునని వివరించారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన సూపర్ జి ఎస్టీ సేవింగ్స్ ద్వారం వ్యవసాయ పనిముట్లు 6 మరియు డ్రిప్ పరికాలపై జి ఎస్టీ 12 నుండి 5 శాతంకు తగ్గడం వలన రైత్తులు లబ్ది పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, నాయకులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం



**రాపూరు, (రాజధాని వార్తలు):** రాపూరు మేజర్ పంచాయితీ పరిధిలోని మద్దెలమడుగు సెంటర్లో వెలిసి ఉన్న శ్రీ మహావిష్ణువు, శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో మాలాధార ధరించిన అయ్యప్ప స్వామి భక్తులకు ఉభయ దాత ఏఎస్ఐ వెంకటేశ్వరరావు దంపతులు చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ దాతల సహకారంతో మాలాధార ధరించిన స్వాములకు ఆలయంలో 41 రోజులు పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వాములకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి దాతలు తమ వంతు సహాయ సహకారాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు దందోలు. వెంకటేశ్వర్లు రెడ్డి, కె.సూర్యనారాయణ రెడ్డి, జె. రాజేష్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

# ఘనంగా కాకినాడ ఐడిఏ ఆధ్వర్యాన ప్రపంచ ఆహార దినోత్సవం



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** కాకినాడ ఐడిఎ సభ్యుల ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ సత్య దంత వైద్యశాలలో నిర్వహించిన ఆహార దినోత్సవం సందర్భంగా మహిళలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కాకినాడ ఐడిఎ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబరు 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. 1945 అక్టోబరు 16న ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ స్థాపించ బడిందన్నారు. దీని వ్యవస్థాపక దినోత్సవానికి గుర్తుగా అక్టోబర్ 16వ తేదీన ఎంచుకున్నారని, ఈ దినోత్సవాన్ని మొదటిసారిగా 1981లో జరుపుకున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలు దీనిని నిర్వహిస్తాయన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం ప్రధాన లక్ష్యాలు తెలుపుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆకలి సమస్య గురించి అవగాహన పెంచడం మరియు దానిని పూర్తిగా అంతం చేయడానికి చర్యలు ప్రోత్సహించడం. భూమిపై ఉన్న ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా పేద దేశాలలో ఉన్నవారికి, తగినంత మరియు పోషకమైన ఆహారం అందుబాటులో ఉండేలా చూడటం. పోషకాహారం యొక్క ప్రాముఖ్యత గురించి, ముఖ్యం గా పిల్లలలో పోషకాహార లోపం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించడం. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా వృధా అవుతున్న భారీ మొత్తంలో ఆహారం గురించి ప్రజలను చైతన్యపరచడ మరియు వృధాను తగ్గించమని ప్రోత్సహించడం భవిష్యత్తు తరాలకు కూడా ఆహార భద్రత ఉండేలా సుస్థిరమైన ఆహార వ్యవస్థలను నిర్మించడానికి కృషి చేయడం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవల్లి, మహిళలు పాల్గొన్నారు.

# వర్మీ కంపోస్టు తయారీపై శిక్షణా కార్యక్రమం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశవవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం (కేవికే), నెల్లూరులో వర్మీ కంపోస్టు తయారీపై అక్టోబర్ 18న తేదీన ఉదయం 10 గంటలకు యువతకు మరియు రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవికే సమన్వయకర్త డా. జి. లలిత శివ జ్యోతి తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించడం, వర్మీ కంపోస్టు తయారీకి అనువైన వానపాముల రకాలు, కంపోస్టు తయారీకి ఉపయోగించే సేంద్రీయ పదార్థాలు, కంపోస్టు షెడ్లు, బెడ్ల ఏర్పాటు విధానాలు, తయారీ ప్రక్రియ దశలు, పంటలలో వినియోగ విధానాలు గురించి రైతులకు శిక్షణ ఉంటుంది. వర్మికంపోస్ట్ విక్రయం మరియు వ్యాపార అవకాశాలపై మార్గదర్శకం ఇవ్వబడును. ఆసక్తిగల రైతులు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరు కావలెను. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే 7981644675 నంబరును సంప్రదించండి.

# మాత రేణుక పరమేశ్వరి ఆలయానికి శంకుస్థాపన



**మనుబోలు, (రాజధాని వార్తలు):** దాతల సాయంతో మనుబోలు అరుంధతి వాడలో నిర్మించనున్న శ్రీమాతా రేణుకా పరమేశ్వరి ఆలయానికి గురువారం దశమి ఘడియల్లో శంకుస్థాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు సాయి కుమార్ శర్మ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించి పుణ్యాహవాచనం గణపతి పూజ అష్టదిక్పాలకుల ఆవాహనం నవగ్రహ శాంతి పూజలు వాస్తు దత్త హెూమం వాస్తు కర్త పూజలు నిర్వహించి శిలను ఏర్పాటు చేసి భూమిక వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు సాని వెంకటరమణయ్య చే రెడ్డి రామిరెడ్డి ముంగర విజయభాస్కర్ రెడ్డి శివుడు రాజా గౌడ్ కంటిపల్లి సుధాకర్ చల్లగల దశయ్య పెంచలయ్య వెంకయ్య హాజరై కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

# పంచారామంలో రైల్వే సిఎండి కుటుంబం పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే పిఆర్సి ఎండి డా.నిర్మల రాజారామ్ కుటుంబం ప్రత్యేక పూజలు చేపట్టారు. గురువారం మధ్యాహ్నం ఆలయా నికి విచ్చేసిన డా.నిర్మల రాజరామ్ కుటుంబానికి ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కంటే జగదీశ్ మోహన్ల ఆధ్వ ర్యంలో ఆలయ మర్యాదల చొప్పున ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు భీమేశ్వర స్వామిని, బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నంది మండపంలో కుటుంబానికి ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేసారు. అలాగే ఆలయ అధికారి వారికి శ్రీస్వామి వారి ప్రసాదం, స్వామి వారి చిత్రపటం అందజేసారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు, వేదపండితులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్శిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్శిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించిన ఫుడ్ & సేఫ్టీ అధికారులు

**- బిర్యానీ తిని యువకుడు మృతి అంటూ సోషల్ మీడియా కథనాలపై స్పందించిన ఫుడ్ & సేఫ్టీ అధికారులు - నామమాత్రంగా తనిఖీలు నిర్వహించిన అధికారులు**





**అమలాపురం, (రాజధాని వార్తలు):** యువకులు తెచ్చుకున్న బిర్యాని ప్యాకెట్లో మండ్రకప్ప (తేలు) దర్శనం.. బిర్యానీ తిని యువకుడు మృతి అంటూ గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్న కథనాలపై ఎట్టికేలకు ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు స్పందించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అమలాపురంలో ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు పలు రెస్టారెంట్లు, హోటల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి రామయ్య, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమారులు విష్ణు శ్రీ, జి కే గ్రాండ్స్ రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించారు. అయితే గత రెండు రోజుల క్రితం తనిఖీలు నిర్వహించిన ఒక రెస్టారెంట్ నుండి ముగ్గురు యువకులు బిర్యాని పార్సెల్ తీసుకొని తినుచుండగా బిర్యానీలో మండ్రకప్ప (తేలు) కనిపించింది. బిర్యానీ తిన్న తర్వాత ఓ యువకుడు మృతి చెందగా మిగిలిన వారు అస్వస్థతకు గురయ్యారంటూ సోషల్ మీడి యాలో కథనాలు వైరల్ అయ్యాయి. అయితే యువ కుడు మృతి చెందిన ఘటనకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలుస్తోంది. సోషల్ మీడియా కథనాలపై స్పందించిన ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు గురువారం నామమాత్రపు తనిఖీలు నిర్వహించారు.

ఎటువంటి ఫుడ్ టెస్టింగ్ పరికరాలు లేకుండా తనిఖీలు నిర్వహించరు. ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను వినియోగించిన జీకే గ్రాండ్ రెస్టారెంట్‌కు రూ. 500 రూపాయలు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్న విష్ణు శ్రీ రెస్టారెంట్ కు రూ. 5 వేల రూపాయలు జరినామా విధించినట్లు కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు నాణ్యత పాటించని వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ అన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించేందుకే బిబిసీ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు

**- బీబీసీ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకుడు రత్నప్రసాద్ - ఈనెల 23 నుంచి డీఎస్సీ టెట్ శిక్షణ తరగతులు**




**అమలాపురం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రాంతంలో ఉత్తమ విద్యాబోధనతో పాటు పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు బీబీసీ ఇనిస్టిట్యూట్ కృషి చేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు సరెళ్ల రత్న ప్రసాద్ అన్నారు. అమలాపురంలోని గొల్లగూడెంలో ఉన్న బీబీసీ ఇనిస్టిట్యూట్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షలకు అభ్యర్థులు శిక్షణ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, పోటీ పరీక్షల అభ్యర్థులు ఎంతో వ్యయ ప్రయాసలతో అనేక ఇబ్బందులు పడేవారని దీనిని దృష్టిలో పెట్టకునే కోనసీమప్రాంత వాసిగా కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో బీబీసీ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేశానన్నారు. అందరికీ అందుబాటులో బీబీసీ ఇనిస్టిట్యూట్ రాకతో పోటీ పరీక్షల అభ్యర్థు లకు ఆర్థిక భారం తగ్గడంతోపాటు అత్యున్నత స్థాయి సదుపాయాలతో సీనియర్ అధ్యాపకుల ద్వారా సమగ్ర శిక్షణ కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. బీబీసీ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసిన తరువాత కేవలం ఏడాది వ్యవధిలోపే ఇంతవరకు 11 మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు బ్యాంకు పరీక్షలు, నలుగురు డీఎస్సీ అభ్యర్థులు, ఇతర పోటీ పరీక్షల్లో మరో అయిదుగురు క్వాలిఫై అయ్యి ఉద్యోగాలు సాధించారని వెల్లడిం చారు. తాజాగా ఇనిస్టిట్యూట్‌లో డీఎస్సీ అభ్యర్థుల కోసం టెట్ బ్యాచ్‌ను ప్రారంభించామని, ఈ శిక్షణ తరగతులు అక్టోబర్ 23 నుంచి ప్రారంభం కానున్నట్లు రత్నప్రసాద్ వెల్లడించారు. ఈశిక్షణ ఇచ్చేం దుకు అవనిగడ్డ నుంచి కె.సత్యానంద రెడ్డి, ఏ.నారాయణరావు తదితర సీనియర్ ఫ్యాకల్టీలు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. బీబీసీ ఇనిస్టి ట్యూట్‌లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, రోజూవారీ టెస్ట్‌లు, సకాలంలో సిలబస్ పూర్తిచేయడంతోపాటు అభ్యశించేందుకు ఏసీ స్టడీ హాల్ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. పోటీ పరీక్షల్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా కీర్తి పతాక ఎగిరేలా బీబీసీ ఇనిస్టిట్యూట్ నిరంతరం కృషి చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీనికి అందరి సహకారం అభ్యర్థిస్తున్నట్లు రత్న ప్రసాద్ ఆకాంక్షించారు.

# తుది దశకు వచ్చిన పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి



**జనగామ, (రాజధాని వార్తలు):** బతుకమ్మ కుంటలో జరు గుతున్న అభివృద్ధి పనులను గురువారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ పరిశీలించారు. డిఆర్‌డిఓ, మున్సిపల్ కమిషనర్, డిఇ మున్సిపల్, ఏడిఆర్‌డిఓ ఎన్ఇఆర్‌పి, పిడి మెప్మా తదితర శాఖల అధికారులకు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పలు సూచనలను జారీ చేశారు. తుది దశకు వచ్చిన పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి అన్నారు.

# సోమరాజు మృత్తి పట్ల సానుభూతి తెలిపిన మంత్రి కొండపల్లి



**గంట్యాడ/ గజపతినగరం/విజయనగరం, (రాజధాని వార్తలు):** గంట్యాడ మండలం చంద్రంపేట గడ్డ వద్ద గల్లంతైన విజ్జపు సోమరాజు మృతి పట్ల రాష్ట్ర ఎమ్ ఎస్ ఎం ఇ, సర్ఫ్, ఎన్.ఆర్.ఐ వ్యవహారాల శాఖ మాత్యులు కొండపల్లి శ్రీనివాస్ తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో విజయనగరం నుంచి బొడ్డవర వెళ్లే మార్గంలోని చంద్రంపేట కాజ్ వేని దాటే ప్రయత్నంలో రెండురోజుల క్రితం ఆర్ వసంత గ్రామానికి చెందిన విజ్జపు సోమరాజు గల్లంతైన విషయం తెలిసిందే. ఆయన మృతదేహం నేడు గాలింపు బృందాలు కనుగొన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాస్ ఈ సంఘటన జరిగిన నేపథ్యాన్ని, బాధితుడి కుటుంబ వివరాలు గ్రామస్థులకు ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటన జరగటం బాధాకరమని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. సోమరాజు కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని ప్రభుత్వం తరపున అందాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan